TGTEL/26/A0320

# భారతీయ వెలుగు

జాతీయ తెలుగు దిన పత్రిక

సోమవారం మార్చి 09, 2026 | సంపుటి :01 | సంచిక :50 | కరీంనగర్ | పేజీలు -12 | వెల-1

Hyderabad,KarimNagar, Warangal, Khammam, Nalgonda, Mahabub Nagar, Nizamabad, Gadwal, Medak, Vikarabad, Wanaparthy, Siddipet,




# టీ20 ప్రపంచ కప్ మనదే..

## చరిత్ర సృష్టించిన టీమ్ఇండియా

డిఫెండింగ్ ఛాంపియన్ టీమ్ఇండియా టీ20 ప్రపంచకప్ 2026 టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో భారత్ గెలిచింది. దీంతో మూడోసారి ట్రోఫీని దక్కించుకొని టీమ్ఇండియా చరిత్ర సృష్టించింది. మరే జట్టు కూడా మూడు టైటిళ్లను గెలుచుకోలేదు. ఎంఎస్ ధోనీ, రోహిత్ శర్మ తర్వాత భారత్‌కు కప్ అందించిన సారథిగా సూర్యకుమార్ యాదవ్ నిలిచాడు. పేజి 2లో ▶



# బెంగాల్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారు: ప్రధాని మోదీ



2లో

# స్వయం బ్రాండ్‌ను గ్లోబల్ బ్రాండ్‌గా మార్చుతాం:



అమరావతి: మహిళలకు ఆస్తిలో సమాన హక్కు ఇచ్చిన నేత ఎన్టీఆర్ అని సీఎం చంద్రబాబు అన్నారు. మహిళలు బాగా చదువుకోవాలని ప్రత్యేక విశ్వవిద్యాలయం తెచ్చారని చెప్పారు. రాజధాని అమరావతిలో మహిళా దినోత్సవ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. "ఇప్పుడు అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువ సంపాదిస్తున్నారు. డ్వాక్రా, మెప్మా వల్ల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారు. మహిళా పారిశ్రామికవేత్తలు ఇప్పటికే లక్ష దాటారు. తీసుకున్న రుణాలను సమయానికి బ్యాంకులకు చెల్లిస్తున్నారు. పేజి 2లో ▶

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం..

# తెలుగు రాష్ట్రాల సీఎంల శుభాకాంక్షలు



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మహిళామణులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

"మహిళల అభ్యున్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది." - సీఎం చంద్రబాబు

"సమాజాభివృద్ధికి మహిళా సాధికారతే నిజమైన ప్రమాణం." - సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలుగింటి ఆడపడుచులకు, తల్లులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు చెప్పారు. ఆడబిడ్డలకు ఆస్తిలో సమాన హక్కు ఇవ్వడం నుంచి ప్రారంభమైన మహిళా సాధికారిత ప్రస్థానం.. నేడు మహిళలను పారిశ్రామిక వేత్తలుగా చేసే విధంగా కొనసాగుతోందని చెప్పారు. మహిళల అభ్యున్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం తల్లికి వందనం, స్త్రీ శక్తి ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, దీపం-2 ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం, ఎన్టీఆర్ భరోసా వితంతు పింఛన్లు వంటి పథకాలను అమలు చేస్తోందని వెల్లడించారు. మెగా డీఎస్సీ ద్వారా 7955 మంది మహిళలకు టీచర్ ఉద్యోగాలు, 993 మహిళలకు కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇచ్చామని వివరించారు.కుటుంబానికి ఆధారం, సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్న మహిళల శక్తి, సహనం, ప్రేమ, త్యాగం అపూర్వమైనవని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. సమాజాభివృద్ధికి మహిళా సాధికారత ప్రమాణమని.. ఆడబిడ్డల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని గుర్తుచేశారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం దినోత్సవం సందర్భంగా ఏపీ మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. జన్మనిచ్చిన అమ్మ .. జీవితాంతమూ మనల్ని కంటికి రెప్పలా కాచే మాతృమూర్తులందరికీ శుభాకాంక్షలు చెప్పారు. తాత తెలుగింటి ఆడపడుచులకు అన్న అయ్యి ఆస్తి హక్కు ఇచ్చారని.. తన తండ్రి మహిళా సాధికారతకు స్వయంశక్తి సంఘాలను ఆరంభించారని గుర్తు చేశారు.

**మెగా డీఎస్సీ: 7,955 మంది మహిళలకు టీచర్ ఉద్యోగాలు.**

**పోలీస్ శాఖ: 993 మంది మహిళలకు కానిస్టేబుల్ ఉద్యోగాలు.**

# విద్యార్థినులకు ఈవీ స్కూటీలు ఇవ్వాలనుకుంటున్నాం: రేవంత్‌రెడ్డి




హైదరాబాద్: హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చుతున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. రెడ్, ఆరెంజ్ కేటగిరి పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు పంపిస్తామని అన్నారు. ప్రజాభవన్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. "మహిళా జర్నలిస్టులతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం సంతోషంగా ఉంది. మహిళలకు సరైన గుర్తింపు ఇవ్వాలని ఈ ప్రభుత్వం భావిస్తోంది. పోలీస్ సహా అవకాశం ఉన్న ప్రతి విభాగంలో మహిళ అధికారులకు బాధ్యతలు అప్పగిస్తున్నాం. మహిళల ఆర్థిక శక్తి పెరిగినప్పుడే దేశం అభివృద్ధి పేజి 2లో ▶

# మహిళా రైతులను ప్రోత్సహిస్తాం: మంత్రి తుమ్మల



హైదరాబాద్: రాష్ట్రంలో మహిళా రైతులను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మెగా రైతు మేళా-2026ను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి తుమ్మల ప్రారంభించారు. పేజి 2లో ▶

# ప్రాజెక్టుల భూ సేకరణ కోసం రూ.5 వేల కోట్లు:

తెలంగాణ వ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల భూసేకరణ కోసం జూన్ 2లోపు నిధులు కేటాయిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.



2లో..

# జగన్‌ది లిక్కర్ మాఫియా



2లో..

# 'చదువుల లోగిలి పల్లపాడు' పుస్తకాన్ని ఆవిష్కరించిన నాగేశ్వరరావు



వట్టిచెరుకూరు: అఖిల భారత సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఎక్కువ మంది మహిళలు ఎంపిక అవుతున్నారని ఈనాడు సంపాదకులు నాగేశ్వరరావు అన్నారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం పల్లపాడులో నల్లూరి ప్రమీల రచించిన 'చదువుల లోగిలి పల్లపాడు' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున పుస్తకావిష్కరణ చేయడం సంతోషంగా ఉందన్నారు. పల్లపాడులో అక్షరాస్యత పెరగాలని సూచించారు. కుటుంబాలకు మహిళలే మూల స్తంభాలని, మహిళలతోనే గ్రామాలు, కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు.

TGTEL/26/A0320
భారతీయ వెలుగు
జాతీయ తెలుగు దిన పత్రిక
సోమవారం మార్చి 09, 2026

# సంపాదకీయం

## ఎవరికీ సబార్డినేట్‌ని కాదు

పశ్చాత్తాపం--ప్రాయశ్చిత్తం... ఈ రెండూ మనుషులకు ఎప్పుడో ఒకప్పుడు అనుభవంలోకి వస్తాయి. మనిషన్నాక ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక తప్పు చేయకుండా ఉండడు. అయితే, తప్పు చేస్తున్నామని గుర్తించి అటువంటి తప్పులను మళ్లీ చేయకుండా... పశ్చాత్తాపం చెంది ప్రాయశ్చిత్తం చేసుకొనే వాళ్లు మనీషిగా నిలుస్తారు. మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఇద్దరు రష్యన్ మహిళలతో గతంలో అక్రమ సంబంధం నెరిపారు. ఇందుకు ఆయన తర్వాత పశ్చాత్తాపం చెందారు. తన సంపదలో సింహభాగాన్ని సేవా కార్యక్రమాలకు కేటాయించి ప్రాయశ్చిత్తం చేసుకుంటున్నారు కూడా! మన దేశంలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో తప్పులు చేసిన, చేస్తున్న రాజకీయ నాయకులు ఇందుకు భిన్నంగా బుకాయిస్తున్నారు. చేసిన తప్పు ఒప్పుకొని చెంపలేసుకోకుండా రాజకీయ ఎత్తుగడలతో రచ్చ సృష్టిస్తున్నారు. తిరుమలలో లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వాడటంతో ప్రారంభమైన తప్పులు ఎన్నెన్నో మలుపులు తిరుగుతున్నాయి. ఈ క్రమంలో లడ్డూనే కాదు-- మతాన్ని కూడా కల్తీ చేస్తున్నారు. తిరుమల లడ్డూకు కల్తీ నెయ్యి వాడటం సత్యం. ఈ తప్పునకు నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రత్యక్షంగా కారకుడు కాకపోవచ్చు. అయితే తన హయాంలో ఆ దేవదేవుడికి అపచారం జరిగినందుకు పశ్చాత్తాపం చెంది, సారీ చెప్పి ఉంటే వివాదం అంతటితో ముగిసేది. జగన్ అండ్ కో అలా చేయకుండా ఎదురుదాడికి దిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థనూ వివాదంలోకి లాగింది. తిరుమలకు నెయ్యి సరఫరా చేసిన సంస్థలలో ఒకటైన ఇందాపూర్ డెయిరీలో హెరిటేజ్ కూడా నెయ్యి ఉత్పత్తి చేసిందని ఆరోపించారు. దీంతో హెరిటేజ్ సంస్థ షేర్ల ధర క్షీణించిందని సంబరపడుతున్నారు. హెరిటేజ్ సంస్థ ప్రైవేట్ కంపెనీ. కాకపోతే అది పబ్లిక్ లిమిటెడ్. షేర్ల ధరలు క్షీణిస్తే ఆ కంపెనీ ప్రమోటర్లకంటే ఆ కంపెనీ షేర్లు కొనుగోలు చేసిన మదుపరులే ఎక్కువగా నష్టపోతారు. ఈ మాత్రం ఇంగితం కూడా లేకుండా హెరిటేజ్‌పై దాడిని ఉధృతం చేశారు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడటానికీ హెరిటేజ్‌కూ ఏమి సంబంధం? కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ఆడుకున్నందుకు క్షమాపణలు చెప్పాల్సిందిపోయి ఒక ప్రైవేట్ కంపెనీపై దాడిని కేంద్రీకరించి పైశాచిక ఆనందం పొందారు. ఈ వ్యవహారంపై శాసన మండలిలో కూడా రచ్చ జరిగింది. ఈ సందర్భంగా మతం తెర మీదకు వచ్చింది. కల్తీ నెయ్యి వ్యవహారం కారణంగా హిందువుల మనోభావాలు దెబ్బతిన్నందున వారంతా జగన్‌రెడ్డికి వ్యతిరేకమవుతారన్న భావన వైసీపీ నాయకుల్లో ఏర్పడినట్టుగా ఉంది. అంతే, కొత్తగా మతం పుచ్చుకున్నవాడికి నామాలు ఎక్కువ అన్నట్టుగా జగన్‌రెడ్డితో సహా ఆ పార్టీ నాయకులు హిందూ మతంపై అంతకు ముందులేని ప్రేమ కనబరచటం మొదలుపెట్టారు. కడపలో పునరుద్ధరించిన దేవాలయాలలో జగన్‌రెడ్డి ప్రత్యేకంగా పూజలు చేయడం చూశాం. 2019 ఎన్నికలకు ముందు కూడా స్వరూపానంద స్వామి చొరవతో జగన్‌రెడ్డి గంగా నదిలో స్నానం ఆచరించారు.నాలుగు తరాలుగా..జగన్‌రెడ్డి కుటుంబం నాలుగు తరాలుగా క్రైస్తవ మతాన్ని ఆచరిస్తోంది. ఇది జగన్‌రెడ్డి ముత్తాత వెంకటరెడ్డితో మొదలైంది. తాత రాజారెడ్డి, తండ్రి రాజశేఖరరెడ్డి, ఇప్పుడు జగన్‌రెడ్డి కూడా అదే మతాన్ని ఆచరిస్తున్నారు. మతం అనేది వ్యక్తిగత స్వేచ్ఛ. ఎవరైనా ఏ మతాన్నయినా స్వీకరించి ఆచరించవచ్చు. జగన్‌రెడ్డి క్రైస్తవ మతాన్ని ఆచరిస్తుంటే ఆక్షేపించవలసింది ఏమీ లేదు. అయితే, ఇప్పుడు ఇది రాజకీయంతో ముడిపడి ఉన్నందున హిందూ మతమన్నా తనకు గౌరవం అని చాటి చెప్పుకోవడానికి ఆయన ప్రయత్నాలు మొదలు పెట్టారు. క్రైస్తవుడయినందునే జగన్‌రెడ్డి తన హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వాడినా పట్టించుకోలేదని కూటమి నాయకులు ప్రచారం చేయడం మొదలెట్టారు. ఈ ప్రచారం వల్ల హిందువులు తనకు దూరమవుతారన్న భయంతో జగన్మోహన్‌రెడ్డి గుళ్లూ గోపురాలు తిరగడం మొదలెట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో మత మార్పిడి చేసుకొని క్రైస్తవులైనవారు హిందూ దేవాలయాలకు వెళ్లరు. తీర్థప్రసాదాలు కూడా ముట్టరు. జగన్‌రెడ్డి రాజకీయాల్లో ఉన్నందున గుళ్లూ గోపురాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నంతవరకు ఆయన క్రైస్తవ మతాన్ని ఆచరిస్తారని చాలా మందికి తెలియదు. ఆ మేరకు ఆయన జాగ్రత్తలు తీసుకున్నారు. జగన్‌రెడ్డి మాత్రం ఆ జాగ్రత్తలు తీసుకోలేకపోయారు. తను ఊరూరా నిర్మించుకున్న ప్యాలెస్‌లపై శిలువ గుర్తు వేయించుకున్నారు. అంతే కాదు, క్రైస్తవ మతం పుచ్చుకున్న ఇతరులు ఆయనకు ఓటు బ్యాంకుగా మారారు. ఈ నేపథ్యంలో కల్తీ నెయ్యి అంశం తెరమీదకు రావడం, దీని ఆధారంగా జగన్‌రెడ్డిని హిందూ వ్యతిరేకిగా ముద్రవేయడానికి కూటమి నాయకులు ప్రయత్నించడం జరుగుతోంది. దీంతో ఉలిక్కిపడిన వైసీపీ నాయకులు ఈ ప్రచారానికి విరుగుడుగా జగన్‌రెడ్డిని దేవాలయాలకు తిప్పడం మొదలెట్టారు. హెరిటేజ్ సంస్థను వివాదంలోకి లాగారు. ఈ క్రమంలో మతాన్ని కూడా కల్తీ చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు శాసనమండలిలో మాట్లాడుతూ జగన్‌రెడ్డితో పాటు శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు కూడా క్రైస్తవులే అని అన్నారు. దీంతో ఉలిక్కిపడిన చైర్మన్ మోషేన్ రాజు 'నేను క్రైస్తవుడిని కాదు, హిందువునే' అని చైర్మన్ స్థానంలో కూర్చొని మరీ ప్రకటించుకున్నారు. వాస్తవానికి ఆయన క్రైస్తవాన్ని ఆచరిస్తారు. చర్చిలకు మాత్రమే వెళ్లి ప్రార్థనలు చేస్తారు. ఆయన దేవాలయాలకు వెళ్లి పూజలు చేసిన దాఖలాలు లేవు. 'ఏసు ప్రభువు మాత్రమే నిజమైన దేవుడు' అని ఆయన స్వయంగా చెప్పిన మాటలు ప్రచారంలోకి వచ్చాయి. క్రైస్తవ మతాన్ని ఆచరించడం నేరం కానప్పుడు మోషేన్ రాజు తాను హిందువునని ఎందుకు చెప్పుకొన్నట్టు? ఇందుకు కారణం లేకపోలేదు. దళితులు తాము క్రైస్తవులమని ప్రకటించుకుంటే రిజర్వేషన్ల కోటాలో బీసీలుగా పరిగణించబడతారు. దళిత కోటాను కోల్పోతారు. ఈ కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో క్రైస్తవులుగా మారిన దళితులలో అత్యధికులు రికార్డుల ప్రకారం హిందువులుగానే కొనసాగుతున్నారు. మోషేన్ రాజు కూడా ఈ కారణంగానే తాను హిందువును అని సభా సాక్షిగా చెప్పుకొని ఉంటారు. మొత్తం మీద మతాన్ని కూడా కల్తీ చేశారు.ఈ నేపథ్యంలోనే హిందువులు సంఘటితమైతే తమ రాజకీయ ప్రయోజనాలు దెబ్బతింటాయన్న భయంతో వైసీపీ నాయకులు ఇప్పుడు హిందూ జపం చేస్తున్నారు. కల్తీ నెయ్యి వ్యవహారం ఇప్పుడు కల్తీ మతం వరకూ వచ్చింది. కల్తీ నెయ్యి వ్యవహారం తెర మీదకు వచ్చినప్పుడే జరిగిన దానికి క్షమాపణలు చెప్పి ఉంటే వివాదం అంతటితో ముగిసి ఉండేది. అలా చేయకుండా ఎదురుదాడికి దిగడం వల్ల తమ మతాన్ని కూడా కప్పిపుచ్చుకోవాల్సిన పరిస్థితిని కొని తెచ్చుకున్నారు.

**గేట్స్‌ను విమర్శించే అర్హత ఉందా...**

ఇంతకు ముందే చెప్పుకొన్నట్టుగా కల్తీ నెయ్యి వాడకానికి జగన్‌రెడ్డి ప్రత్యక్షంగా కారకుడు కాకపోయి ఉండొచ్చు. కాసులకోసం కక్కుర్తిపడిన ఎవరో ఆ పాతకానికి ఒడిగట్టారు. జరిగిన దానికి నైతిక బాధ్యత వహించి దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవలసిందిగా జగన్‌రెడ్డి కోరి ఉంటే హుందాగా ఉండేది. అలా చేయకపోగా మనసులో ఇష్టం లేకపోయినా గుళ్లూ గోపురాల చుట్టూ తిరగవలసి వస్తోంది. ఈ మొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తే మన రాజకీయ నాయకులకు దేవుడు, మతం కూడా రాజకీయాలకు ముడి సరుకుగా మారిపోయాయనిపిస్తోంది. రాజకీయ ప్రయోజనాల కోసం తాము విశ్వసించని మతాన్ని నమ్ముతున్నట్టు ప్రకటిస్తారు. ఇష్టం లేని దేవుడికి పూజలు చేస్తారు. మనసులో చిరాకుగా ఉన్నప్పటికీ నామాలు పెట్టుకుంటారు. గోటితో పోయేదాన్ని గొడ్డలి దాకా తెచ్చుకోవడం అంటే ఇదే. ఇప్పుడు చెప్పండి, బిల్‌గేట్స్‌ను నానా మాటలూ అన్నవారికి ఆయనను విమర్శించే నైతిక అర్హత ఉందా? కల్తీ నెయ్యి అంశం రుజువైన తర్వాత కూడా బుకాయిస్తున్న ఈ ముఠాకు, ఎవరూ కోరకపోయినా బేషరతుగా క్షమాపణలు చెప్పిన బిల్ గేట్స్‌ను నిందించే నైతికత ఉందా? బిల్ గేట్స్ తిండికైన ఖర్చెంతో చెప్పాలని కోరడం ఏమిటి? ఆయన తిండికి లేక ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారా? ఇలాంటి విపరీత ధోరణులు వైసీపీకి మాత్రమే సొంతం. ఆ పార్టీ రాజకీయ ఎత్తుగడలు కూడా ఊహలకు అందనంత క్రూరంగా ఉంటాయి. తప్పు చేసినప్పుడు దాన్ని అంగీకరించడానికి ధైర్యం కావాలి. ఈ ధైర్యం ఉన్నందునే బిల్ గేట్స్ క్షమాపణలు చెప్పుకొన్నారు. ధైర్యం లేనందునే జగన్ అండ్ కో కల్తీ నెయ్యి విషయంలో ఎదురుదాడిని ఎంచుకున్నారు. ఎవరు ఏ దారిని ఎంచుకున్నా పాపం చేసిన వారిని ఆ దేవదేవుడే చూసుకుంటాడు.

## జగన్‌ది లిక్కర్ మాఫియా

మొదటి పేజీ తరువాయి

దేవరపల్లి, గోపాలపురం: డిజిటల్ పేమెంట్ లేకుండా నగదు పద్ధతిలో లిక్కర్ విక్రయించి మాఫియాకు తెరలేపిన ఏకైక సర్కారు జగన్‌మోహన్ రెడ్డిదేనని ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం దుద్దుకూరులో ఆదివారం ఆమె పర్యటించారు. గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతూ అంత విచ్చలవిడిగా మద్యం, డ్రగ్స్ రాష్ట్రంలో విక్రయించారు కాబట్టే అప్పట్లో మహిళలపై దాడులు పెరిగాయన్నారు. దివంగత నేత వైఎస్ఆర్ మొదలుపెట్టిన జలయజ్ఞాన్ని కూడా జగన్ పూర్తి చేయలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి పదేళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

## బెంగాల్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారు: ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పర్యటనలో ప్రొటోకాల్ పాటించకపోవడంపై కేంద్ర ప్రభుత్వం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ విషయంపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. టీఎంసీ (ఎవీజ)పై మండిపడ్డారు. రాష్ట్రపతి ముర్ము బెంగాల్‌కు వెళ్తే సత్కరించడానికి బదులు..ఆమె పాల్గొనే కార్యక్రమానికి అక్కడి ప్రభుత్వం అనుమతివ్వలేదన్నారు. ఇటువంటి చర్యలతో మమత ప్రభుత్వం రాష్ట్రపతిని మాత్రమే కాకుండా భారత రాజ్యాంగాన్ని కూడా అవమానించిందని అన్నారు.

ద్రౌపదీ ముర్ము (గతీవంఅఒవత్ వీబతీఎబ) ఎంతో కష్టపడి దేశంలోని అత్యున్నత స్థానానికి ఎదిగారని మోదీ పేర్కొన్నారు. మురికి రాజకీయాలు చేసే తృణమూల్‌కు బెంగాల్ ప్రజలు త్వరలోనే తగిన బుద్ధి చెబుతారన్నారు. త్వరలో జరగనున్న బెంగాల్ ఎన్నికల్లో విజయం సాధించేది భాజపానేనని ధీమా వ్యక్తం చేశారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై కేంద్రం సీరియస్.. వివరణ ఇవ్వాలని ఆదేశం

మరోవైపు కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగానే తప్పుడు ఆరోపణలు చేస్తోందని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. ఎన్నికల్లో విజయం కోసం భాజపా దేశంలోని అత్యున్నత పదవిని దుర్వినియోగం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి స్థానాన్ని తాము గౌరవిస్తామన్నారు. ఆ కార్యక్రమంలో ద్రౌపదీ ముర్ము పాల్గొంటారనే విషయంపై ఎటువంటి ముందస్తు సమాచారం లేదన్నారు.

## 'గివ్ హర్ స్పేస్' తెలంగాణ జాగృతి నినాదం: కవిత



హైదరాబాద్: మహిళా దినోత్సవం రోజే కాదు.. ప్రతిరోజు మహిళలను గౌరవించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. 'గివ్ హర్ స్పేస్' పేరిట పోస్టర్‌ను ఆవిష్కరించారు. 'స్టాండ్ విత్ హర్' కాదు.. 'గివ్ హర్ స్పేస్' జాగృతి నినాదం అని వివరించారు. "పెద్ద కులం, చిన్న కులం కాదు.. మహిళలంతా ఒక్కటే కులం. ఏ ఇంట్లో పుట్టినా సరే.. వారిపై వివక్షే ఉంటోంది. భర్త, తండ్రి, అన్న అందరూ తక్కువ చేసేవారే. మహిళలు లేకుండా తెలంగాణ ఉద్యమమే లేదు. సామాజిక తెలంగాణ సాధనలోనూ వారి పాత్రే కీలకం. వయసుతో సంబంధం లేకుండా మహిళలంతా రాజకీయాల్లోకి రావాలి. కాంగ్రెస్ వచ్చాక వారిపై నేరాల శాతం పెరిగింది. మహిళలకు 33 శాతం సీట్ల రిజర్వేషన్ సాధనతో జాగృతి చరిత్ర సృష్టించింది" అని కవిత అన్నారు.

## హెచ్‌సీఏలో డబ్బులు తీసుకొని క్రీడాకారుల ఎంపిక: బండి సంజయ్ ఆరోపణ

తెలంగాణచౌక్ (కరీంనగర్): రాష్ట్రంలో ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ప్రోత్సాహం లేకపోవడం



బాధాకరమని కేంద్రం మంత్రి బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) నిదర్శనమన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 7 వరకు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ పేరిట క్రీడాపోటీలు నిర్వహించారు.

అందులో గెలుపొందిన ఆటగాళ్లకు ఆదివారం కరీంనగర్‌లోని ఓ హోటల్లో నిర్వహించిన కార్యక్రమంలో బండి సంజయ్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హెచ్‌సీఏకు ఎంపిక కావాలంటే పైరవీలు, డబ్బులు ఇచ్చే సంస్కృతిని కొందరు తీసుకొచ్చారని, క్రీడాకారుల ప్రతిభను దెబ్బతీసే ఇలాంటి దుర్మార్గానికి చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియా మిషన్ ఏర్పాటు చేస్తోందన్నారు.

ఈ మిషన్ క్రీడాకారుల్లో ప్రతిభకు మార్గం చూపడంతోపాటు శిక్షకులు (కోచ్), సహాయక సిబ్బంది వ్యవస్థాపక అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు.

## టీ20 ప్రపంచ కప్ మనదే..

### చరిత్ర సృష్టించిన టీమ్‌ఇండియా

మొదటి పేజీ తరువాయి

ఆతిథ్య జట్టు స్వదేశంలో ట్రోఫీ గెలవడం ఇదే మొదటిసారి కావడం విశేషం.

ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగులు చేసింది. సంజు శాంసన్ (89), ఇషాన్ కిషన్ (54), అభిషేక్ శర్మ (52) హాఫ్ సెంచరీలు సాధించారు. అనంతరం లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్ 19 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌటైంది. టిమ్ సీఫెర్ట్ (52) టాప్ స్కోరర్. మిచెల్ శాంట్నర్ (43) రాణించాడు. మిగతా బ్యాటర్లు చేతులెత్తేశారు. భారత బౌలర్లు సమష్టిగా రాణించి కివీస్‌ను కట్టడి చేశారు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా 4, అక్షర్ పటేల్ 3.. హార్దిక్ పాండ్య, వరుణ్, అభిషేక్ తలో వికెట్ తీశారు.

## స్వయం బ్రాండ్‌ను గ్లోబల్ బ్రాండ్‌గా మార్చుతాం:

మొదటి పేజీ తరువాయి

తెలుగు మహిళలు ఏ పని తలపెట్టినా.. సాధించే వరకు వదలరు. అప్పులు ఇప్పించే బాధ్యత నాది.. సద్వినియోగం చేసుకునే పని మీది. స్వయం బ్రాండ్‌ను గ్లోబల్ బ్రాండ్‌గా మార్చే బాధ్యత నాది. మీరు చేసిన ప్రతి వస్తువుకు మంచి ధర వచ్చేలా చూస్తాం. ప్రతి ఇంట్లో స్వయం బ్రాండ్ ఉత్పత్తులే వాడాలి. ఈ ఏడాది మరో 5 లక్షల మందిని పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తాం. డ్వాక్రా, మెప్మాలో 1.1 కోట్ల మంది సభ్యులున్నారు. మీరు తయారు చేసే ఉత్పత్తులు దేశవ్యాప్తంగా విస్తరించాలి. మా ఇంట్లో కూడా ఇద్దరు మహిళలను పారిశ్రామికవేత్తల్ని చేశాం. నా భార్య, కోడలు సమర్థంగా వ్యాపారం నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంట్లోనూ మహిళా వ్యాపారవేత్త ఉండాలి. ఆడబిడ్డల రక్షణ విషయంలో మాత్రం రాజీ లేదు. దుర్మార్గులను అరికట్టాల్సిన బాధ్యత కూడా మీదే. మహిళల జోలికి వస్తే అదే వారికి చివరిరోజు అవుతుంది. ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంట్లో ఎవరికీ వ్యాధులు రాకుండా చూసుకునే బాధ్యత మీదే. సమాజంలో వచ్చిన మార్పుల వల్ల జనాభా తగ్గిపోతోంది. జనాభా తగ్గితే అనేక ప్రమాదాలు వస్తాయి. పెద్ద కుటుంబంతో మనకు రక్షణ, భద్రత, ఆనందం. ప్రభుత్వ పథకాలన్నీ పెద్ద కుటుంబాలకే అందేలా చూస్తాం. ఇప్పుడు 58శాతం మంది ఒక్క బిడ్డకే పరిమితం అవుతున్నారు. రాష్ట్ర ఆదాయం పెరగాలంటే ముందుగా అభివృద్ధి జరగాలి. అభివృద్ధి జరగాలంటే రాష్ట్రంలో సుపరిపాలన ఉండాలి. మనకు డబ్బు సమస్య కాదు.. ఆలోచనా విధానమే ముఖ్యం. మీ పరిధిలో ఉన్న విషయాల్లో తప్పు చేయకుండా ముందుకెళ్లాలి. ఇంటా, బయటా చిన్న చిన్న సమస్యలు వచ్చాయని వెనక్కి తగ్గవద్దు. ఇప్పుడు ప్రతి పథకం మహిళల పేరుతోనే ఇస్తున్నాం. ఇల్లు, గ్రామం పరిశుభ్రంగా ఉండాలి. తగాదాలు రాకుండా చూడాలి. ఇప్పుడు ఇళ్లలో ఎవరూ మాట్లాడుకోవడం లేదు. అందుకే సమస్యలు. ఫోన్ ఎక్కువగా చూసినా మానసిక సమస్యలు వస్తాయి. స్మార్ట్ ఫోన్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఫోన్ ఎక్కువగా చూడకుండా భర్త, పిల్లలను మీరే కంట్రోల్ చేయాలి." అని చంద్రబాబు సూచించారు.

## విద్యార్థినులకు ఈవీ స్కూటీలు ఇవ్వాలనుకుంటున్నాం: రేవంత్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

"హైదరాబాద్‌లోని డీజిల్ బస్సులను 2026 డిసెంబర్‌లోపు జిల్లాలకు తరలిస్తాం. హైదరాబాద్‌లో వంద శాతం ఈవీ బస్సులను తెస్తున్నాం. డిసెంబర్ 9లోపు నగరంలో డీజిల్ బస్సులు ఉండవు. హైదరాబాద్‌లో ఏసీ ఈవీ బస్సులు తెస్తాం. కళాశాలలకు వెళ్లే విద్యార్థినులకు ఈవీ స్కూటీలు ఇవ్వాలనుకుంటున్నాం" అని సీఎం అన్నారు.

గాంధీ విగ్రహానికి రూ.70 కోట్లే ఖర్చు

"గాంధీ విగ్రహ నిర్మాణానికి రూ.500 కోట్లు అవుతుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆ విగ్రహానికి రూ.70 కోట్లే ఖర్చు అవుతుంది. గాంధీ విగ్రహం వద్ద విజ్ఞాన మందిరానికి రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నాం. హైదరాబాద్‌లో కాలుష్యం, దోమలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు. మూసీని ప్రక్షాళన చేస్తామంటే అడ్డుపడుతున్నారు. మూసీ ప్రక్షాళన వద్దంటున్నారా.. తొలగింపులు వద్దంటున్నారో స్పష్టత ఇవ్వండి. నష్టపరిహారం ఇచ్చే బఫర్ జోన్‌లోని ఇళ్లను తొలగిస్తాం. నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపిస్తాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## మహిళా రైతులను ప్రోత్సహిస్తాం: మంత్రి తుమ్మల

మొదటి పేజీ తరువాయి

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రెండు రోజుల పాటు మహిళా రైతు మేళా జరగనుంది. సహజ వ్యవసాయం చేసే మహిళా రైతులకు ప్రాధాన్యం ఇస్తామని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ అగ్రగామిగా నిలిచిందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. 27 మంది మహిళా రైతులకు పురస్కారాలు ప్రదానం చేశారు.

## ప్రాజెక్టుల భూ సేకరణ కోసం

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల భూసేకరణ కోసం జూన్ 2లోపు నిధులు కేటాయిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూ సేకరణకు రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తామన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా ప్రాజెక్టుల పురోగతిపై జలసౌధలో అధికారులతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను గత ప్రభుత్వం పదేళ్లు పట్టించుకోలేదన్నారు. 2014 జూన్ 2న ఎలా ఉన్నాయో 2024 జూన్ 2న కూడా అలాగే ఉన్నాయని చెప్పారు. "పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు నీటి సోర్సును మార్చివేసి రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారు. కాళేశ్వరంలో చేసిన పొరపాటే.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో చేశారు. ఎంత ఖర్చయినా సరే.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. వచ్చే రెండేళ్లలో రూ.22వేల కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం" అని ఉత్తమ్ పేర్కొన్నారు.

## వివాహ బంధానికి మచ్చ.. భర్తకు బీమా చేయించి హత్య

ఏదులాపురం: మద్యానికి బానిసైన భర్త పేరిట బీమా చేయించిన ఓ మహిళ, ఏడాదైనా అతడు చనిపోకపోవటంతో బంధువు సాయంతో హత్య చేసింది. వివాహ బంధానికి మచ్చతెచ్చే ఈ ఘటన ఖమ్మం జిల్లాలో వెలుగుచూసింది. ఖమ్మం రూరల్ సీఐ ముష్కరాజు ఆదివారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 2న గ్రామీణ మండలం ఎంవీపాలెం సమీపంలోని ఖమ్మం-కురవి ప్రధాన రహదారి పక్కన ఓ గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. అన్నం ఫౌండేషన్ ఛైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది సహకారంతో శవాన్ని పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చనిపోయిన వ్యక్తిని ఖమ్మం నగరం గాంధీనగర్‌కు చెందిన చాగంటి రవి (42)గా నిర్ధరించారు. అతడి మృతిపై అనుమానం వ్యక్తం చేసిన బంధువులు, రవి భార్య చాగంటి ప్రశాంతితోపాటు దేశపోయిన శ్రీనివాస్(ఏ1)పై అనుమానం ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు విచారణలో పోలీసులను విస్తుగొలిపే విషయాలు బయటపడ్డాయి. భార్య ప్రశాంతి(ఏ5)నే ఈ హత్య చేయించినట్టు తేలింది. చాగంటి రవి, ప్రశాంతికి 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. రవి ఆటో డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. మద్యానికి బానిసైన అతను తరచూ భార్యతో గొడవపడేవాడు.

భారతీయ వెలుగు
జాతీయ తెలుగు దిన పత్రిక
సోమవారం మార్చి 09, 2026

# ఆర్థికంగా అధికారికంగా మహిళలు ఎదగాలి

## - శంకర్పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేష్ కుమార్





**భారతీయ వెలుగు:శంకర్పల్లి, మార్చి:8,** మహిళలందరూ ఆర్థికంగా, అధికారికంగా అభివృద్ధి చెందినప్పుడే అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి అర్థం ఉంటుందని శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్ నరేష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం నాడు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శంకర్ పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలోని స్టాఫ్ నర్స్ కృపా దేవిని శాలువతో సన్మానించన, అనంతరం ఓ గుడిసెలలో నివసించే కూలీ మహిళను కూడా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ మాత, పిత, గురువు, దైవం లలో మొదటి స్థానం స్త్రీ లదే అని, అలాంటి స్త్రీలను సమాజం గౌరవించాలని తెలిపారు. నేటి ప్రతి విద్యార్థిని, మహిళలందరూ ఓ రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయిల వలె కీర్తిని సాధించేలా ఎదగాలన్నారు. వచ్చే మహిళా దినోత్సవం నుండి అయినా రాజ్యాంగం ప్రకారం భారత ప్రభుత్వం దేశంలోని సగం మహిళలను ఆర్థికంగా ఆదుకొని వారి కష్టాలను దూరం చేయాలని నరేష్ కుమార్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ మహేష్ యాదవ్, వైభవ్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన మహిళలకు స్వీట్లు పంచి పెట్టి శుభాకాంక్షలు తెలిపారు.

# కేంద్ర మంత్రులకు వివాహ ఆహ్వాన పత్రిక









**భారతీయ వెలుగు,తూ.గో.జిల్లా ప్రతినిధి(సత్తి వెంకటరెడ్డి అనపర్తి/ఢిల్లీ):** హైదరాబాద్ జూబ్లీహిల్స్ జె ఆర్ సి కన్వెన్షన్ లో ఎప్రిల్ 2 న అంగరంగ వైభవంగా జరిగే అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతుల కుమార్తె డాక్టర్ నల్లమిల్లి సనాతని, పాణ్యం ఎమ్మెల్యే, నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షురాలు గౌరు చరితా రెడ్డి వెంకటరెడ్డి కుమారుడు జనార్దన్ రెడ్డి వివాహ వేడుకకు ఆహ్వానిస్తూ పలువురు ప్రముఖులకు వివాహ ఆహ్వాన పత్రిక ఎమ్మెల్యే నల్లమిల్లి అందజేశారు. ఆదివారం ఢిల్లీలో పౌర విమానయాన శాఖ కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు సాన సతీష్, గంటి హరీష్ కుమార్ కు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వివాహ శుభలేఖ అందించారు.

# మహిళా దినోత్సవం సందర్భముగా..

## - ఓ మహిళా.. ఓ మహిళ



**భారతీయ వెలుగు, హైదరాబాద్, 08:** భూదేవికి ఉన్న ఓర్పు ఉందంటూ..నింగీ నేల హద్దులు లేవంటూ సమాన అవకాశాలు ఉన్నాయంటూ.. కల్ల బొల్లి మాటలు వింటూ సామాజిక కట్టుబాట్ల ఆటుపోట్లు తట్టుకుంటూ.. పోటీ ప్రపంచం లో వెనుకడుగు వేసేది లేదంటూ పురుషుడితో సమానంగా బరువు మోస్తానంటూ.. కుటుంబ బాధ్యతలు పాలు పంచుకుంటూ.. కట్టుబడిన కాపురానికి ఆసరాగా ఉంటూ.. ఆకాశమంత అవకాశాలను అందిపుచ్చుకుంటూ.. అంతులేని ఆవేదనలను అణచుకుంటూ..అనంతమైన సంఘర్షణలను నెట్టుకుంటూ..అణువణువున అద్భుత శక్తిని ప్రోది చేసుకుంటూ..ఓ మహిళా నీ తపనకు జేజేలు చెప్పుకుంటూ..ఓ మహిళా నీ ఘనతను మరలా ఒప్పుకుంటూ..లక్ష్మీ అన్నపూర్ణ రావినూతల టిజిటి -ఇంగ్లీష్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం, బాపట్ల

# జీవీఆర్ కరాటే అకాడమీ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు




**భారతీయ వెలుగు, హైదరాబాద్, మార్చి 08:** జీవీఆర్ కరాటే అకాడమీ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళల శక్తి, ధైర్యం మరియు సామర్థ్యాన్ని ప్రతిబింబించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులైన బాలికలు ధైర్యంగా, క్రమశిక్షణతో మరియు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు కరాటే శిక్షణ ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమం ద్వారా తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హిమాయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి మహాలక్ష్మి రామన్న గౌడ్ హాజరై ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ ఈ రోజు అమ్మాయిలే రేపటి సమాజానికి నాయకులు, రక్షకులు మరియు బలమైన స్థంభాలు అని పేర్కొన్నారు. చిన్న వయస్సు నుంచే అమ్మాయిలకు సరైన మార్గదర్శనం, అవకాశాలు మరియు శిక్షణ అందితే వారు ప్రతి రంగంలోనూ విజయాలు సాధించగలరని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమం జీవీఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి గారి మార్గదర్శకత్వంలో నిర్వహించబడింది. ఆయన కూడా ఈ కార్యక్రమానికి హాజరై అకాడమీ ద్వారా బాలికలు మరియు మహిళలకు స్వీయరక్షణతో పాటు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందించే శిక్షణ అందిస్తున్నామని తెలిపారు.

కార్యక్రమంలో అకాడమీ విద్యార్థులు కరాటే ప్రదర్శనలు నిర్వహించి తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలు విద్యార్థుల శిక్షణ, క్రమశిక్షణ మరియు పట్టుదలను ప్రతిబింబించాయి.కార్యక్రమం ముగింపులో ముఖ్య అతిథిని సత్కరించారు. ఈ కార్యక్రమానికి అకాడమీ విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు కూడా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

## - మహిళా పెన్షనర్లకు ఘన సన్మానం






**భారతీయ వెలుగు, హనుమకొండ, మార్చి 08:** అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 8వ తేదీన జరుపుకుంటారని, మహిళల సామాజిక, ఆర్థిక,రాజకీయ విజయాలను గుర్తించడం, లింగ సమానత్వం, మహిళల హక్కుల కోసం పోరాటం చేయడం ఈ దినోత్సవ లక్ష్యమని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ (యస్ జి పి ఎ టి) రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ వెలిశోజు రామ మనోహర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం ను స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కాశీబుగ్గ లోని కె వి ఎస్ ఫంక్షన్ హాల్ లో తేది ఆదివారం జిల్లా అధ్యక్షులు తుమ్మ వీరయ్య అధ్యక్షతన నిర్వహించగా.., రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ వెలిశోజు రామ మనోహర్ ముఖ్య అతిథిగా పాల్గొని " మహిళలు అన్ని రంగాలలో ముందుకు రావాలని, బాలికలు ఇప్పటి నుండే వారి సమస్యల పట్ల అవగాహన పెంచుకునేందుకు మహిళలు ప్రోత్సహించాలని " తమ సందేశంలో పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గునిగంటి సాంబయ్య,అసోసియేట్ అధ్యక్షులు పెట్లోజు పరమేశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు కె కుమార స్వామి, కె మధుసూదన్ రావు, కాశీబుగ్గ యూనిట్ అధ్యక్షులు ఎం డి మదార్ సాహెబ్,ప్రధాన కార్యదర్శి కందగట్ల యాదగిరి లతో పాటు 65 మంది పెన్షనర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కె చంద్ర కళ, ఎం స్వరూప, తోట రమా దేవి,జి లక్ష్మీ, వి లక్ష్మీ, ఇందిర,పి రేఖా ప్రియ, ఉమావతి, కె రాజ మణి, భాగ్యమ్మ,సువర్ణ, కామిశెట్టి లక్ష్మీ తదితర 12 మంది పెన్షనర్లను శాలువాలతో రాష్ట్ర,జిల్లా నాయకులు సన్మానించడం జరిగింది.

# భారీగా పెరిగిన గ్యాస్ ధరలు

## - నేటి నుంచి ఒక్కో సిలిండర్ పై పెంపు ఇలా..!



**భారతీయ వెలుగు హైదరాబాద్ ప్రతినిధి**
ఇరాన్ పై అమెరికా-ఇజ్రాయెల్ ప్రారంభించిన యుద్ధం, దానికి ప్రతిగా ఆ దేశం చేస్తున్న ప్రతిదాడులు భారత్ పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అంతా ఊహించినట్లుగానే గ్యాస్ ధరల మంట ప్రారంభమైంది.హార్ముజ్ జలసంధి నుంచి ఎల్పీజీ సరఫరాలపై ప్రభావం పడుతున్న నేపథ్యంలో కేంద్రం గ్యాస్ ధరలు పెంచేసింది. ఇవాళ్టి నుంచి ఇళ్లకు వాడే సిలెండర్లతో పాటు వాణిజ్య సిలెండర్లపైనా భారీగా రేట్లు పెంచుతూ చమురు కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి.

దేశవ్యాప్తంగా 14.2 కిలోల గృహోపకరణాల వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.60 పెరిగింది. అదేవిధంగా 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధర కూడా రూ.115 పెరిగింది. దీని ప్రభావం హోటళ్ళు, రెస్టారెంట్లు, చిన్న వాణిజ్య సంస్థలపై పడబోతోంది. పెరిగిన గ్యాస్ సిలెండర్ ధరలు ఇవాళ్టి నుంచే అమల్లోకి వస్తున్నాయి. ఢిల్లీలో 14.2 కిలోల గృహోపకరణాల ఎల్పీజీ సిలిండర్ ధర రూ.853 నుండి రూ.913 కు పెరిగింది. ముంబైలో కొత్త రేటు ఇప్పుడు రూ.852.50గా ఉంది. కోల్‌కతాలో ధర రూ.879 నుండి రూ.030 కు పెరిగింది. చెన్నైలో ఇది రూ.868.50 నుండి రూ.928.50 కు పెరిగింది.

మరోవైపు ఢిల్లీలో 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర రూ.1768.50 నుండి రూ.1883కి పెరిగింది. ముంబైలో కమర్షియల్ సిలెండర్ ధర రూ.1720.50 నుండి రూ.1835కి పెరిగింది. అలాగే కోల్‌కతాలో ధర రూ.1875.50 నుండి రూ.1990కి పెరిగింది, చెన్నైలో ఇది రూ.1929 నుండి రూ.2043.50కి పెరిగింది. వాస్తవానికి గ్యాస్ సిలెండర్ ధరలు గతేడాది ఏప్రిల్ నుంచి మారలేదు. ఇరాన్ వార్ నేపథ్యంలో భారతదేశ ఇంధన సరఫరా, ఇంధన లభ్యతపై పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఈ పెంపు అమల్లో వచ్చిది. దీంతో దేశంలో ఇంధన కొరత లేదని, సరఫరాలో అంతరాయాల గురించి వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర పెట్రోలియం , సహజ వాయువు మంత్రి హర్దీప్ సింగ్ పూరి గతంలో చెప్పిన మాటలు నిజం కాదని తేలిపోయింది.

# ప్రజాసేవ చేస్తున్న వ్యక్తికి కార్పొరేషన్ ఎన్నికల్లో టికెట్ బండి





**భారతీయ వెలుగు ప్రతినిధి హైదరాబాద్**
ప్రజాసేవలో ముందున్నవారికి ప్రజాభిమానం చూరగొన్న వారికే రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో టికెట్ కేటాయించడం జరుగుతుందని టిపిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా ఆయన శనివారం వసంత నగర్ డివిజన్ పరిధిలోని సర్దార్ పటేల్ నగర్ లో స్థానిక నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. స్థానిక ప్రజలు తమతో ప్రస్తావించిన సమస్యలపై వెంటనే స్పందిస్తూ పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు సూచించారు. పార్టీ నాయకుడు సాయిబాబా చౌదరి ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ఇందుకోసం రూ కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు హైడ్రా ఏర్పాటు కొందరికి కంటగింపుగా మారిందని కానీ హైడ్రా వల్ల రూ కోట్ల రూపాయల విలువైన నీటి వనరులు పార్కులు కుంటలు చెరువులు రక్షింపబడ్డాయన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాజీ ముఖ్య మంత్రులు ఎన్టీ రామారావు గారు, రాజశేఖర్ రెడ్డి స్ఫూర్తితో రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి పనులను కొనసాగిస్తున్నారన్నారు. సోమవారం కూకట్పల్లిలోని నల్లచెరువును సీఎం చేతుల మీదుగా ప్రారంభిస్తారు అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెటింగ్ కమిటీ మెంబెర్స్, టెంపుల్ కమిటీ మెంబర్స్ , డివిజన్ అధ్యక్షులు ,బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు , యూత్ కాంగ్రెస్, నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు, బీసీ సెల్ నాయకులు ,సేవ్ దళ్ నాయకులు మరియు కార్యకర్తలు మరియు కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవము





**భారతీయ వెలుగు శేరిలింగంపల్లి**
తారానగర్ లో గల విద్యానికేతన్ మోడల్ హైస్కూల్ నందు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ .వి.ఆర్ గ్రూపు సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో గల 40 కాలనీలలో నిర్వహించిన క్రీడా పోటీలలో విజేతలైన మహిళలకు బహుమతి ప్రదానోత్సవం మరియు 90 మంది స్థానిక మహిళా నాయకురాళ్ళకు ఆత్మీయ సత్కారము చేయడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మి (హైదరాబాదు సెంట్రల్ యూనివర్శిటీ) మరియు మూలా వెంకటేష్ గౌడ్ (ప్రముఖ సంఘ సేవకులు మరియు ఛైర్మెన్ ఎం.వి.ఆర్ గ్రూపు) విచ్చేసి విజేతలైన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి యాదవ్ సభను ఉద్దేశిరచి స్వాగతం పలికి అంతర్జాతీయ మహిళాదినోత్సవ విశేషాలను తెలియజేశారు. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో గల మహిళా గ్రూపుల మహిళలు భారతీయ సంస్కృతీ పరిరక్షకులనీ, వారిలోని కళాత్మక జీవన విధానం ఒక క్రమపద్ధతిలో కొనసాగుతుంటుందని కొనియాడారు. ఎం.వి.ఆర్ గ్రూప్ అధినేత మూలా వేంకటేష్ గౌడ్ ప్రసంగిస్తూ " ఇంతమంది మహిళామణులు వారి వారి కాలనీల్లో అభివృద్ధి పనులు చేస్తూ సంఘటితంగా ఉండడం చాలా మంచి విషయం అని తెలిపారు. " ఆర్థికంగా కుటుంబాలను బలోపేతం చేస్తూ సాంస్కృతిక కార్యకలాపాల్లో పాల్గొంటూ ఎదుగుతున్నందుకు సంతోషంగా ఉంది అని ఆనందాన్ని వ్యక్తం చేశారు తదనంతరం ప్రసంగించిన ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మిగారు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళాలోకానికి శుభాకాంక్షలు అందించారు. నేటి మహిళే రేపటి భవిత అని అన్ని రంగాల్లో తమ సత్తా చాటుతున్న మహిళలు స్వయం శక్తులుగా నిలదొక్కుకోవాలి అని సూచించారు మహిళలు రాజకీయరంగంలో తమ సాధికారికతను నిరూపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు సంపూర్ణ అక్షరాస్యతతో పాటు రచనా రంగంలో తమదైన ముద్రతో రాణించాలి. అంతేకాకుండా ఆర్థిక స్వావలంబన దిశగా ఎదగాలి. అప్పుడే నిజమైన మహిళా సాధికారికత ఏర్పడుతుంది అని ఉద్బోధించారు. భారతీయ మహిళల అభ్యున్నతి వెలకట్టలేనిదని, ప్రతి మహిళా తనకున్న శక్తియుక్తులను తనకోసం కాకుండా నిరంతరం కుటుంబంకోసం, దేశంకోసం వెచ్చిస్తున్నారు నిత్యం శ్రమిస్తూనే కాలం గడుపుతుండే స్త్రీల కష్టానికి, శ్రమకి ఖరిదుకట్టే నాధుడే లేరు. కానీ ఎవరికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా నేనున్నానంటూ ముందుకు వచ్చేది స్త్రీలే. మహిళ నిస్వార్థ పరురాలు. తన సంతానం ఎదుగుదలకు నిరంతరం శ్రమిస్తూ ఉంటుంది. కుటుంబ ఆదాయాన్ని అవసరాలకు తగిన విధంగా ఖర్చుచేస్తూ పొదుపు విధానాన్ని పాటించేటటువంటి ఆర్థికవేత్త" అని మహిళామణులను కొనియాడారు. చివరిగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి విజయజ్యోతి, మహిళా నాయకురాళ్ళు శ్రీమతులు నాగమణి మాజీ కౌన్సిలర్, వాణి సాంబశివరావు, విజయలక్ష్మి, కుమారి, రాణి యాదవ్, జ్యోతి, లక్ష్మి, వరలక్ష్మి, తన్వీర్ బేగం, నజీరా, చంద్రకళ, వాణి, మెర్సీ, శ్రీ చందన, రోజీ, కుర్రా ధనలక్ష్మి మరియు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అమ్మయ్య చౌదరి, శివరామకృష్ణ, జనార్ధన్, . రావు తదితరులు పాల్గొన్నారు.

# కూకట్పల్లిలోని పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు...





**భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**
కూకట్‌పల్లి లోని అశోక్ గార్డెన్స్‌లో తోట వారి కుటుంబ సభ్యుల వివాహ వేడుకలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరై నూతన వధూవరులైన అలేఖ్య, శివరామ ప్రసాద్‌లను అభినందించారు.ఈ సందర్భంగా రాజేశ్వరరావు నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారు నిండు నూరేళ్ళు సుఖసంతోషాలతో ఆనందంగా దాంపత్య జీవితాన్ని గడపాలని ఆశీర్వదించారు.

TGTEL/26/A0320
భారతీయ వెలుగు
జాతీయ తెలుగు దిన పత్రిక
సోమవారం మార్చి 09, 2026

# ఇస్కాన్ టెంపుల్ కి భూమి పూజ

» రాష్ట్ర దేవాదాయ,శాఖ మంత్రి కొండా సురేఖ

» ఆలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం....

» ఆలయం,వేద పాఠశాల, గోశాల,కమ్యూనిటీ కిచెన్ షెడ్ నిర్మాణానికి భూమి పూజ..........

**భారతీయ వెలుగు ప్రతినిధి శేరిలింగంపల్లి**
హరే రామ హరే రామ రామ రామ హరే హరే... హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే...........అంటూ భక్తుల జయజయ ధ్వానాల మధ్య శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపనపల్లి గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ రంగనాథ స్వామి దేవాలయం పక్కన నూతనంగా నిర్మించనున్న ఇస్కాన్ సైబరాబాద్ ఆలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆలయం, వేద పాఠశాల, గోశాల మరియు మెగా కమ్యూనిటీ కిచెన్ షెడ్ నిర్మాణాలకు శంకుస్థాపన చేపట్టారు.





ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర దేవాదాయ,అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ , పీఏసీ చైర్మన్,శేరిలింగంపల్లి శాసన సభ్యులు ఆరెకపూడి గాంధీ,చేవెళ్ల మాజీ పార్లమెంట్ సభ్యులు రంజిత్ రెడ్డి , బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ , గచ్చిబౌలి డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.



ఈ సందర్భంగా నిర్వాహకులు ముఖ్య అతిథులకు ఘన స్వాగతం పలికి పూలమాలలతో సత్కరించారు.వేద పండితులు వేద మంత్రాలతో పూజా కార్యక్రమాలను నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. గోపనపల్లి గ్రామంలో ఇస్కాన్ సంస్థ సుమారు 1.5 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఆలయం, వేద పాఠశాల, గోశాల మరియు మెగా కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం జరగడం ద్వారా భక్తుల సంక్షేమం, సాంస్కృతిక విలువల పరిరక్షణ, గ్రామీణాభివృద్ధి మరియు సామాజిక సేవకు ఇది ఎంతో దోహదపడుతుందని అన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లో మొదటిసారిగా ఇస్కాన్ ఆలయం నిర్మాణం జరగడం స్థానిక ప్రజల అదృష్టమని ఆమె పేర్కొన్నారు.

అనంతరం మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ఆలయం, వేద పాఠశాల, గోశాల వంటి ధార్మిక మరియు సాంస్కృతిక నిర్మాణాల కోసం భూమికి కేటాయించడం ద్వారా గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధికి మరింత దోహదపడుతుందని అన్నారు. గోపనపల్లి గ్రామ అభివృద్ధి తనకు ఎంతో ప్రాధాన్యమని, గ్రామ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. స్థానికంగా భక్తులకు మరియు గ్రామీణ యువతకు సాంస్కృతిక, ధార్మిక విలువలు పెంపొందేలా ఇస్కాన్ సంస్థతో కలిసి కార్యాచరణకు పూర్తి మద్దతు ఇస్తానని పేర్కొన్నారు.

ఈ భూమి కేటాయింపుతో నిత్య అన్నదాన కార్యక్రమాలు, వేద విద్యా బోధన, పశుసంరక్షణ సేవలు కమ్యూనిటీ కిచెన్ వంటి సదుపాయాలు స్థానిక ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని ఆయన తెలిపారు. భక్తి, సేవా మరియు శాంతి మార్గాల్లో గోపనపల్లి గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి ఇది కీలకమైన ముందడుగు అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఇస్కాన్ సైబరాబాద్ ఆలయం సమాజానికి మేలు చేకూర్చే వేద సాంస్కృతిక కేంద్రంగా అభివృద్ధి చేయబడనుంది. అదనంగా, ఈ ఆలయంలో శ్రీ శ్రీ రాధా కృష్ణ మరియు ఆళ్వార్ల మందిరాలు ఏర్పాటు చేయబడతాయి. భక్తులకు నిత్య పూజలు, భజనలు, గీతా భాగవత ప్రవచనాలు నిర్వహించబడతాయి. పిల్లలు యువతలో సనాతన ధర్మం, భారతీయ సంస్కృతి నైతిక విలువలు పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టబడతాయి.

అలాగే పర్యావరణ పరిరక్షణకు వృక్షారోపణ కార్యక్రమాలు నిర్వహించబడతాయి.ఈ ఆలయం కేవలం పూజా స్థలంగా మాత్రమే కాకుండా ఆధ్యాత్మికత, సంస్కృతి, సేవ మరియు సమాజ అభివృద్ధి కలిసే కేంద్రంగా నిలవనుంది.

ఈ కార్యక్రమంలో ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, భక్తులు, మహిళలు, స్థానిక నాయకులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ కంప్యూటేషన్ పోటీలను విజయవంతంగా నిర్వహించిన విశ్వం ఎడ్యుటెక్...

**భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**
నైపుణ్య విద్యలో ప్రముఖ సంస్థ అయిన విశ్వం ఎడ్యుటెక్ జాతీయ స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ కంప్యూటేషన్ పోటీలను ఆదివారం కూకట్‌పల్లి లోని పీఎన్ఎం ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు.ఈ పోటీలలో భారతదేశంలోని 10 రాష్ట్రాల నుండి సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన విద్యార్థులు తమ గణిత ప్రతిభను ప్రదర్శిస్తూ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ జె.ఎస్. పరంజ్యోతి,చైర్మన్, ఓయాసిస్ ఇన్స్టిట్యూషన్స్ ,వైస్ ప్రెసిడెంట్, హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని



పెంపొందించేందుకు అబాకస్, వేదిక్ మ్యాథ్స్ వంటి నైపుణ్యాధారిత విద్య ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా విశ్వం ఎడ్యుటెక్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. సతీష్ బాబు మాట్లాడుతూ నైపుణ్య విద్య ప్రతి విద్యార్థికి చేరాలనీ ప్రైవేట్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ ఇది అందుబాటులో ఉండాలి అన్నారు. జాతీయ విద్యా విధానం ప్రకారం మన విద్యా వ్యవస్థలో గణనీయమైన మార్పు రావాలప్రతి విద్యార్థి తన రెగ్యులర్ అకడమిక్స్‌తో పాటు కనీసం ఒక నైపుణ్యంలో శిక్షణ పొందాలని తెలిపారు.విశ్వం ఎడ్యుటెక్ సీఈఓ శ్రీ హరి చరణ్ మాట్లాడుతూ భారతదేశంలో నైపుణ్య విద్య వేగంగా విస్తరిస్తోందనీ జాతీయ స్థాయి పోటీల ద్వారా విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి మరింత ప్రోత్సాహం అందించడం మా లక్ష్యం" అని అన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ, సమగ్ర విద్య భవిష్యత్‌కు అవసరమైన నైపుణ్యాలతో విద్యార్థులను తీర్చిదిద్దడంలో విశ్వం ఎడ్యుటెక్ నిబద్ధతను మరింత బలపరిచింది అన్నారు.

## బర్కత్ పుర లో ఇఫ్తార్ విందు

**భారతీయ వెలుగు, హైదరాబాద్,మార్చి 08:**



పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఒక్కపొద్దులు ఉంటూ పవిత్రంగా అల్లాను ఆరాదిస్తారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. అన్వర్ ఉలూం ఇనిస్టిట్యూట్స్ సెక్రటరీ నవాబ్ మహబూబ్ అలంఖాన్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు నవాబ్ ముజాహిద్ అలంఖాన్ ఆధ్వర్యంలో ఆదవారం రాత్రి బర్కత్ పుర లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీ, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు మోత రోహిత్ తదితరులు ఈ సందర్భంగా మత పెద్దలతో కలిసి ప్రార్థనలు చేసి ఇఫ్తారన్ను స్వీకరించారు. అనంతరం మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ముజాయిద్ అలంఖాన్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. రంజాన్ మాసం అనేది పేద, ధనిక భావం లేకుండా అందరిని సమానంగా చూస్తుందని, ఇఫ్తార్ విందు ఇందుకు నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను సమానంగా చూస్తుందని మంత్రి వివేక్ స్పష్టం చేశారు.

## అమ్మగా ప్రేమను, చెల్లిగా తోడును, భార్యగా బాధ్యతను పంచుతూ ప్రతి రూపంలోను ప్రపంచాన్నినడిపిస్తున్నది మహిళా ...

– మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జి పట్నం సునీత మహేందర్ రెడ్డి.

**భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**
మహిళల శక్తి, ధైర్యం, సాధన సమాజానికి ప్రేరణ, సమాజ నిర్మాణంలో మహిళ కీలక పాత్ర పోషిస్తున్నద నీ మల్కాజ్గిరి పార్లమెంటు ఇంచార్జ్ పట్నం సునీత మహేందర్ రెడ్డి పేర్కొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కెపిహెచ్బి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జి పట్నం సునీత మహేందర్ రెడ్డి , నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్, పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం తదితరులు హాజరయ్యారు. ఈ



సందర్భంగా పట్నం సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ మన భారతీయ సంస్కృతిలో మహిళను శక్తి స్వరూపిణిగా పరిగణిస్తారు. అమ్మగా కుటుంబాన్ని నిలబెట్టే శక్తి, అక్కగా ఆప్యాయతను పంచే ప్రేమ, భార్యగా జీవితానికి అండగా నిలిచే ధైర్యం, సమాజానికి దిశానిర్దేశం చేసే నాయకత్వం వంటి లక్షణాలు మహిళలకు ఉన్నాయి అన్నారు. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ మహిళల గౌరవం, భద్రత, సమాన హక్కుల కోసం పోరాడుతూ, మహిళలకు విద్య, ఉపాధి,



స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంది అన్నారు. మహిళలు బలంగా ఉంటే దేశం బలంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిధ విభాగాల నాయకులు, మహిళా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ మైనారిటీ, ఎస్సీ, బీసీ సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ తల్లిని దర్శించిన మాజీ ఎమ్మెల్యే సత్తి



**భారతీయ వెలుగు,తూ.గో.జిల్లా ప్రతినిధి(సత్తి వెంకటరెడ్డి,అనపర్తి/బిక్కవోలు):**
బిక్కవోలు మండలం తొస్సిపూడిలో గల శ్రీ దుర్గమ్మ తల్లి తీర్థ మహోత్సవం సందర్భంగా అనపర్తి వైఎస్ఆర్సిపి కోఆర్డినేటర్,మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి దర్శించుకున్నారు.ఆయనతో పాటు పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నల్లమిల్లి త్రినాధ రెడ్డి(బాబి), ఉప సర్పంచ్ ద్వారంపూడి వీర వెంకట రామారెడ్డి (తవ్వయ్య) కర్రి సుబ్బిరెడ్డి, మాజీ సర్పంచ్ గుబ్బల అన్నవరం, సబ్బెళ్ళ సత్తిరెడ్డి,చింతా సత్యనారాయణ రెడ్డి(బండారు స్వామి),లురుకుర్తి రాజు, దాకమర్రి అప్పన్న తదితరులు ఉన్నారు.

జగన్ మద్య నిషేధం వెనక అసలు కథ ఇదేనా

ఆంగ్ల పత్రిక కథనాన్ని కోట్ చేసిన లోకేశ్

అమరావతి,మార్చి7(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి , గత వైసీపీ ప్రభుత్వంపై మంత్రి నారా లోకేశ్ మరోసారి విరుచుకుపడ్డారు. గత ప్రభుత్వం ఇచ్చిన మద్య నిషేధం హామీ గురించి ప్రస్తావిస్తూ.. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మంత్రి లోకేశ్ సంచలన పోస్ట్ చేశారు. ఒక ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని తన ట్వీట్‌కు అటాచ్ చేసిన మంత్రి.. 2019 ఎన్నికల్లో జగన్ ఇచ్చిన 'మద్య నిషేధం' హామీ వెనుక ఇదే నిజమైన స్టోరీనా అంటూ వ్యాఖ్యలు చేశారు.'ప్రతి నెలా రూ.100 కోట్లు కిక్‌బ్యాగ్స్, రూ.3,500 కోట్లు మనీ లాండరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వెలికి తీసిన రూ.1,048 కోట్ల లావాదేవీల జాడ ఎక్కడ' అని ప్రశ్నించారు. ఒక ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని తన ట్వీట్‌కు అటాచ్ చేసిన లోకేశ్... '2019 ఎన్నికల్లో జగన్ మీరు ఇచ్చిన మద్య నిషేధం హామీ వెనుక ఇదే నిజమైన స్టోరీనా. మీరు మద్య నిషేధం గురించి ప్రసంగిస్తూ ఉండగానే ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ మద్యం వేలాది కుటుంబాలను ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నాశనం చేసింది. ఇదే టైంలో మీ అనుచరుల జేబులు వేల కోట్ల రూపాయలతో నిండిపోయాయి. ఏపీ ప్రజలకు మీరు సమాధానం చెబుతారా? లేక మౌనంగా ఉండడమే మంచిదని అనుకుంటున్నారా?' అని ప్రశ్నిస్తూ ట్వీట్ చేశారు.

## మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి: రాకేష్ గైక్వాడ్

– సృష్టికి మూలం మహిళ మహిళ లేనిదే మనగడ లేదు
– ప్రతి మహిళ శక్తికి ప్రతిరూపమే





**భారతీయ వెలుగు, హైదరాబాద్, మార్చి08 :**
పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో దూసుకెళ్లే మహిళా మణులకు ఏదో ఒక్కరోజు గౌరవం కాదు ఎల్లప్పుడూ గౌరవం దక్కాలి అని హరిబోలి డివిజన్ తెలంగాణ జాగృతి యువ నాయకులు రాకేష్ గైక్వాడ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను కలసి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూతురుగా, భార్యగా, అమ్మగా అన్ని పాత్రలకు సరైన న్యాయం చేసే స్త్రీ ఈ భూవితో సమానమైన సహనశీలి అందుకే ఆమెను మనం గౌరవిద్దాం, ఆదరిద్దాం అని అన్నారు. మహిళలు అని రంగంలో అభివృద్ధి చెందాలని, రాజకీయంగా ఆర్థికంగా మహిళలు బలోపేతం చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందని సృష్టికి మూలం మహిళ , మహిళ లేనిదే మనుగడ లేదని ప్రతి మహిళ శక్తికి ప్రతి రూపమని ఈ సందర్భంగా అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి నాయకులు కఠినమైన ఆస్థానా,శ్రీకర్ శర్మ,రాజు కుమార్, ఓంకార్ స్వామి,నిలయ్, భూషణ్ రాయ్,ఆస్థానా
నితిన్, నవీన్,రూప్ సింగ్,సచిన్,శశి,పల్లవి,ముఖేష్,రాహుల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## దహగాం ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్ ఆస్పత్రిలో అపరిశుభ్రతపై ఆగ్రహం

పరిశుభ్రత అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. శనివారం దహెగాం మండలం కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో నెలకొన్న అపరిశుభ్రతను చూసి ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మీ ఇంట్లో అయితే ఇలాగే ఉంచుతారా? అని సిబ్బందిని ప్రశ్నించారు. ఆసుపత్రి పనితీరును, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వార్డులో, ఆసుపత్రి ప్రాంగణంలో చెత్తాచెదారం పేరుకుపోయి ఉండటం గమనించి స్వయంగాచీపురు పట్టి ఊడ్చారు. రోగులు కోలుకోవాల్సిన చోట ఇలాంటి అపరిశుభ్ర వాతావరణం ఉండటంపై అక్కడి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ ఆసుపత్రి పరిసరాలను పర్యవేక్షించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఉన్నతాధికారి హోదాలో ఉండి కూడా ఆమె స్వయంగా చీపురు పట్టి శుభ్రం చేయడం చూసి రోగులు, ఆసుపత్రి సిబ్బంది ఒక్కసారిగా విస్తుపోయారు. వేంటనే ఆమెతో కలిసి పారిశుద్ధ్య పనుల్లో పాల్గొన్నారు.

## సివిల్స్‌లో ఓబిసి అధ్యర్థులకు ర్యాంకులు

– అభినందించిన తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్

ఇటీవల విడుదలైన సివిల్ పరిక్షా ఫలితాల్లో తెలంగాణకు చెందిన 20 మంది అభ్యర్థులకు మంచి మార్కులు రావటం, అందులో 10 మంది అభ్యర్థులు ఓబీసీ వర్గానికి చెందినవారు కావడం ఎంతో సంతోషదాయకమని తెలంగాణ బీసీ కమిషన్ అభివర్ణించింది. బీసీ కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి తెలంగాణ నుండి మంచి ర్యాంకులు సాధించిన 20 మంది అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. తెలంగాణ నుండి మంచి ర్యాంకులు వచ్చిన 20 మందిలో 10 మంది బీసీ వర్గాలకు చెందిన వారు కావడం బీసీల్లో విద్యాపరంగా కలుగుతున్న చైతన్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు.

## ముగిసిన ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ

తెలంగాణ రాజకీయాల్లో గత ఏడాది కాలంగా ప్రకంపనలు సృష్టిస్తున్న ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారం ఇప్పుడు చివరిదశకు చేరుకుంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శనివారం తుది విచారణను ముగించారు. సుప్రీ కోర్టు విధించిన గడువు శనివారంతో ముగియనుండటంతో, స్పీకర్ వెలువరించబోయే తీర్పుపై రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది.

TGTEL/26/A0320
భారతీయ వెలుగు
జాతీయ తెలుగు దిన పత్రిక
సోమవారం మార్చి 09, 2026

# మేటి నగరాలతో పోటీపడే విధంగా తీర్చిదిద్దుతాం రేవంత్ రెడ్డి

**భారతీయ వెలుగు ప్రతినిధి హైదరాబాద్**
దేశంలోని ప్రధాన మెట్రోపాలిటన్ సిటీలు ఎదుర్కొంటున్న ప్రమాదకర పరిస్థితులు సమీప భవిష్యత్తులో హైదరాబాద్‌కు తలెత్తకుండా నివారించడంతో పాటు ఈ నగరాన్ని ప్రపంచంలోనే మేటి నగరాలతో పోటీ పడే విధంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రణాళికలు రూపొందించామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వెల్లడించారు.
కాలుష్య నియంత్రణలో భాగంగా హైదరాబాద్‌లో తిరిగే ఆర్టీసీ బస్సులను 2026 డిసెంబర్ 9 నాటికి వంద శాతం ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టబోతున్నామని చెప్పారు.
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జ్యోతిరావు పూలే భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మహిళా జర్నలిస్టులను సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, హైదరాబాద్‌ను కాపాడుకోవడానికి, అంతర్జాతీయ నగరంగా రాణించడానికి, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వానికి అందరి సహకారం కావాలని కోరారు.
"దేశంలోని ప్రధాన మెట్రోపాలిటన్ నగరాలు ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు ఎదుర్కొంటున్నాయో మహిళా జర్నలిస్టులు విశ్లేషించాలి. వర్షాలొస్తే ముంబయ్ అతలాకుతలమవుతోంది. వాయు కాలుష్యంతో ఢిల్లీ సతమతమవుతోంది. బెంగుళూరులో ట్రాఫిక్ సమస్యలు, వరదలొచ్చినప్పుడు చెన్నైలో ఏర్పడే



ప్రమాదకర పరిస్థితులను గమనిస్తూనే ఉన్నాం. సమీప భవిష్యత్తులో హైదరాబాద్ నివాసయోగ్యం కాని నగరంగా మారే పరిస్థితులు రావొద్దు. ఇలాంటి పరిస్థితులు హైదరాబాద్ నగరానికి తలెత్తకూడదనే ప్రణాళికలు రూపొందించాం. హైదరాబాద్‌లో వాయు నాణ్యత (ఏ క్యూ ఐ) ఇప్పటికే ఆరెంజ్ కేటగిరీలోకి చేరింది. మరింత ప్రమాదకంగా జీవించడానికి వీలులేని పరిస్థితులు తెచ్చుకోవద్దు.
హైదరాబాద్‌లో చెత్త పేరుకుపోతోందని, దోమలు పెరిగాయనో, మూసీలో కాలుష్యం పారుతోందని, నియంత్రించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ప్రభుత్వం అందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టకుండా ఎలా సాధ్యం. నదుల్లో కాలుష్య నివారణకు ఢిల్లీలో యమునా రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు, యూపీలో గంగా నది ప్రక్షాళన, గుజరాత్‌లో సబర్మతీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులు చేపట్టినట్టే, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు ఎందుకు చేపట్టొద్దు.
సుప్రీంకోర్టు, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాల మేరకు మూసీ నదికి సంబంధించి బఫర్ జోన్ విషయంలో 2012లో నిబంధనలు రూపొందించారు. నాలా అయితే బఫర్ జోన్ ఎంత ఉండాలి, చెరువులైతే ఎంత ఉండాలి, నదులైతే ఎంత ఉండాలన్నది ఖరారు చేశారు. ఆ మేరకు మూసీ నది వెంట నాలా అయితే 10 మీటర్లు, నదికి 50 మీటర్ల బఫర్ జోన్ ప్రాంతాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు.
కాలుష్య కారక మూసీ నది పునరుజ్జీవ కార్యక్రమంలో నిర్వాసితులకు ప్రభుత్వం సరైన సహాయం అందిస్తుంది. ప్రాజెక్టును అడ్డుకోవడంకన్నా బాధ్యత కలిగిన వారంతా నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించడం లేదా వారికి మరే ఇతర ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రభుత్వంతో చర్చించవచ్చు.
గాంధీ సరోవర్ ప్రాజెక్టు వద్ద ఒక అపార్ట్‌మెంట్‌పై ఈ మధ్య చర్చ జరుగుతోంది. 7 ఎకరాల ప్రాంతంలో ఉన్న అపార్ట్‌మెంట్‌కు అంతే స్థలమిచ్చి, కొత్తగా నిర్మాణానికి అయ్యే ఖర్చును బ్యాంకులో డిపాజిట్ చేస్తామని చెప్పాం. లేదా నష్టపరిహారం తీసుకుని వేరే ప్రాంతంలో కట్టుకుంటామన్నా ఇబ్బంది లేదని ప్రభుత్వం పలు ప్రత్యామ్నాయాలను సూచించింది.
మూసీ రివర్ ఫ్రంట్ ఫేజ్ -- 1లో గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం 5 వేల కోట్లు, 10 వేల కోట్లు వెచ్చిస్తున్నారంటూ చిలువలు పలువలు చేసి ప్రచారం చేస్తున్నారు. గాంధీ విగ్రహం కోసం దాదాపు 70 కోట్లు, విజ్ఞాన కేంద్రం, ఆ ప్రాంత అభివృద్ధి మొత్తంగా 200 కోట్లు మాత్రమే ఖర్చవుతుంది.
ఈ వాస్తవాలను ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉంది. ఈ ప్రాజెక్టు సమగ్ర ప్రణాళికపై ఈ నెల 13న పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వబోతున్నాం.
కాలుష్య నివారణలో భాగంగా 2026 డిసెంబర్ 9 నాటికి హైదరాబాద్‌లో ఆర్టీసీ ద్వారా వంద శాతం ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెడుతాం. ప్రస్తుతం ఆర్టీసీలో 2800 బస్సులు డీజిల్‌తో నడుస్తున్నాయి. కాలుష్య నియంత్రణలో భాగంగా వాటి స్థానంలో 500 ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టాం.
డీజిల్ వాహనాలను ఓఆర్ఆర్ అవతలి ప్రాంతానికి తరలించి వాటి స్థానంలో డిసెంబర్ నాటికి నూరుశాతం ఈవీ బస్సులను ప్రవేశపెడుతాం. ఈవీ వాహనాలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఈవీ వాహనాలకు జీరో పన్ను పాలసీ తెచ్చాం.
నగరంలో 2 లక్షల ఆటోలున్నాయి. డీజిల్, పెట్రోల్ ఇతర ఇంధన ఆధారంగా నడుస్తున్న ఈ ఆటోలను రెట్రోఫిటింగ్ కింద ఈవీలుగా మార్చాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. సింగల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నాం. నగరంలో కాలుష్య కారక రెడ్, ఆరెంజ్ కేటగిరీలోని పరిశ్రమలను నగరం అవతలి వైపునకు తరలిస్తున్నాం.
దేశ జనాభాలో 2.5 శాతం ఉన్న తెలంగాణ జీడీపీలో 5 శాతం మేరకు దోహదపడుతున్న నేపథ్యంలో 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగాలని లక్ష్యాలను నిర్దేశించాం. 2047 నాటికి దేశ జీడీపీలో 10 శాతం తెలంగాణ నుంచి దోహదపడాలి. ఈ లక్ష్యసాధనలో మహిళలు సంపూర్ణంగా సహకరించాలి.
మహిళా జర్నలిస్టులకు ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపునిస్తుంది. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేసే చోట మహిళలకు రక్షణ కోసం కమిటీలను ఏర్పాటు చేస్తాం. రక్షణ కల్పించడమే కాకుండా ప్రభుత్వం అవకాశాలను కల్పిస్తుంది. డెస్క్ జర్నలిస్టుల గుర్తింపు విషయంలో ఎవరికీ అన్యాయం జరగదు.
మహిళలు ఆర్థికంగా ఎదిగిన కారణంగానే కొన్ని దేశాలు ఆర్థికంగా బలమైన దేశాలుగా నిలబడ్డాయి. సమాజంలో మహిళల పట్ల కొనసాగుతున్న వివక్షకు ముగింపు పలకాలంటే మహిళల శక్తిని గుర్తించి సమాన అవకాశాలు కల్పించాలి. మహిళల శ్రమకు తగిన గుర్తింపు లభించడం లేదు. కష్టపడే వారికి గుర్తింపునివ్వాల్సిన బాధ్యత అందరిపైనా, ప్రభుత్వాలపైనా ఉంది.
దేశంలో అగ్రస్థానంలో తెలంగాణను నిలపాలన్న లక్ష్య సాధనలో మహిళా జర్నలిస్టుల సహకారం ఉండాలి. మహిళలకు ప్రాధాన్యత కలిగిన రాష్ట్రంగా తెలంగాణకు గుర్తింపు తెచ్చుకుందాం.." అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి , కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజహరుద్దీన్ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి , ఐ అండ్ పీఆర్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక తో పాటు మహిళా జర్నలిస్టులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా కౌన్సిలర్లు సన్మానించిన మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్

**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట మార్చి 8**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపాలిటీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ ఎండి ఆయాజ్ ఆధ్వర్యంలో జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన మహిళా మున్సిపల్ కౌన్సిలర్లను గౌరవంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) ముఖ్య అతిథిగా హాజరై మహిళా ప్రజాప్రతినిధులను శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా అభినందించారు.
ఈ సందర్భంగా చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం వల్ల మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు లభించాయని తెలిపారు. దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, నేటి సమాజంలో మహిళలు విద్య, వైద్యం, పరిపాలన, వ్యాపారం, రాజకీయాలు వంటి అనేక రంగాలలో ముందుకు వచ్చి తమ ప్రతిభను చాటుకుంటున్నారని అన్నారు. మహిళలు ధైర్యంగా ముందుకు సాగితే కుటుంబం మాత్రమే కాకుండా సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు.
ప్రతి మహిళ ఆర్థికంగా బలపడాలని, సమాజంలో గౌరవంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు.





మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించి కుటుంబానికి తోడ్పడాలని సూచించారు. "ఇల్లాలే ఇంటికి దీపం" అన్న నానుడి ప్రకారం మహిళలు కుటుంబానికి మార్గదర్శకులుగా ఉంటారని, మీరు బాగుంటే మీ కుటుంబం బాగుంటుందని, కుటుంబం బాగుంటే సమాజం బాగుంటుందని తెలిపారు.
నూతనంగా ఎన్నికైన మహిళా కౌన్సిలర్లు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించడానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రతి వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలని కోరారు. జమ్మికుంట పట్టణ అభివృద్ధికి అందరూ కలిసి సమన్వయంతో పని చేయాలని, పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.
మున్సిపల్ కమిషనర్ ఎండి ఆయాజ్ మాట్లాడుతూ మహిళలు ప్రజాసేవలో ముందుకు రావడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. మహిళా ప్రజాప్రతినిధులు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందుండాలని సూచించారు. మహిళల సాధికారతతోనే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, మున్సిపల్ మేనేజర్ జి. రాజిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, మహిళా ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా మహిళా కౌన్సిలర్లను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం మహిళలకు ప్రోత్సాహాన్నిస్తూ, మహిళా నాయకత్వాన్ని మరింత బలపరిచే దిశగా సాగిందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. మహిళలు రాజకీయాల్లో మరింతగా ముందుకు వచ్చి ప్రజాసేవలో పాల్గొంటే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా పలువురు తెలిపారు.

## వ్యవసాయ యాంత్రీకరణకు సబ్సిడీ నిధులు నేరుగా రైతుల ఖాతాలోకి బదిలీ

- విధివిధానాలు తయారుచేయాలి
- ఏప్రిల్ నెలాఖరు వరకు పచ్చిరొట్ట విత్తనాలను సిద్ధం చేయాలి
- రెడ్కో సహకారంతో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు
- ఖరీఫ్ సీజన్ కోసం ముందుగానే ఎరువులు
- అధికారులను అదేశించిన మంత్రి తుమ్మల

వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి వ్యవసాయ యాంత్రీకరణకు సంబంధించిన సబ్సిడీ నిధులను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేసే విధానాన్ని అమలు చేసే అవకాశాలను పరిశీలించి, అవసరమైన విధివిధానాలను రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా రైతులు కొనుగోళ్లు చేసిన పనిముట్లకు 40 శాతం సబ్సిడీ నిధులను సదరు కంపెనీలకు అందించే పద్దతి ఉంది అలా కాక, వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి సబ్సిడీ నిధులను నేరుగా రైతుల ఖాతాలోకి బదిలీ చేసే అవకాశాలను పరిశీలించి అందుకు తగ్గ విధివిదానాలను తయారు చేయాలన్నారు. రాష్ట్రంలో రైతులకు సబ్సిడీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలను వచ్చే ఏప్రిల్ నెలాఖరు సిద్దంగా ఉంచుకోవాలని అందుకు తగ్గ ఏర్పాట్లు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు వేదికలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని, ఇందుకు రెడ్కో సంస్థ సహకారం తీసుకోవాలని అధికారులకు సూచించారు. మొదట ప్రయోగాత్మకంగా జంగారెడ్డిపల్లి మరియు జనంపేట రైతు వేదికలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి వాటి పనితీరును పరిశీలించిన తరువాత మొదటి దశలో రాష్ట్రంలోని 1600 రైతు వేదికలలో రెడ్కో ద్వారా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ూానున్న ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రానికి అవసరమైన ఎరువులను ముందుగానే తెప్పించి నిల్వ ఉంచేందుకు ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభించాలని మంత్రి అధికారులకు సూచించారు. ఎరువుల సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన కూడ ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్రానికి అవసరమైన ఎరువులను ముందుగానే సమకూర్చుకోవాలని తెలిపారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ అధికారులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో వరి, పత్తి, మక్క వంటి ప్రధాన పంటల సాగు విస్తృతంగా జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా మక్క పంటకు వరి లేదా పత్తి పంటలతో పోలిస్తే యూరియా అవసరం దాదాపు మూడింతలు ఎక్కువగా ఉంటుందని చెప్పారు. నీటి నిల్వలు సమృద్ధిగా ఉండటం, నేలలో తేమ నిల్వ ఉండటం, అలాగే దక్షిణ పశ్చిమ రుతుపవనాలు సాధారణంగా ప్రారంభమవుతాయనే అంచనాల నేపథ్యంలో రానున్న ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం సుమారు 60.60 లక్షల హెక్టార్లలో సాగు అయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఖరీఫ్?2026 సీజన్‌కు రాష్ట్రానికి 11.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు.

## నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశాన్ని ప్రారంభించిన మహ్మద్ షబ్బీర్ అలీ

కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భిక్కనూర్ లక్ష్మి, చిట్యాల రాజమణిలకు నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎం ఆదేశాల మేరకు లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు , వస్త్రాలు అందజేశారు. అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కతో ఫోన్ ద్వారా మాట్లాడించి, లబ్ధిదారులకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ , జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి పాదయాత్ర సమయంలో కూలిపోయిన ఇళ్లను చూసి చలించిపోయి అధికారంలోకి రాగానే ఇళ్లను నిర్మించి ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశం చేయించడం ప్రభుత్వం ప్రజల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న మరికొన్ని ఇందిరమ్మ ఇళ్లను కూడా త్వరలో పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధు మోహన్, గ్రామ సర్పంచ్ లక్ష్మి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్, మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు సన్మానం







**భారతీయ వెలుగు ప్రతినిధి వేములవాడ**
వేములవాడలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాలోత్ లత, కానిస్టేబుల్ రేణుక, ఇంజనీర్ పవన కుమారి, అడ్వకేట్ నాయిామా నాసారి, డాక్టర్ పద్మలత, సోషల్ వర్కర్ కరుణ, రాజన్న ఆలయ ఉద్యోగిని మమత, పారిశుద్ధ్య కార్మికురాలు లక్ష్మీ లను ట్రస్ట్ సభ్యులు శాలువా కప్పి మెమెంటో అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాలోత్ లత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చాటుతూ సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, గొంగళ్ళ రవికుమార్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, పసుల శ్రీధర్, గొండ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ కేంద్రంగా ప్రపంచస్థాయి ఏఐ ఆర్థిక ఆవిష్కరణలు

**- మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి**

కృత్రిమ మేధ ఆధారిత ఆర్థిక సాంకేతిక రంగంలో హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోందని ఐటి, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. శనివారం నాడు బాచుపల్లిలోని విజ్ఞానజ్యోతి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ లో ఫిక్కి నిర్వహించిన సిఎఫ్ ఓ ల సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేసారు. ప్రపంచంలోని ప్రముఖ ఆర్థిక సంస్థలు నగరంలో తమ ఆవిష్కరణలు, ఇంజినీరింగ్ కేంద్రాలను స్థాపిస్తున్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కృత్రిమ మేధ టెక్నాలజీ పాత్రను పూర్తిగా మార్చేస్తోంది. ఇప్పటివరకు కంపెనీ ఖర్చులను లెక్కించడానికి ఉపయోగపడిన టెక్నాలజీ, ప్రస్తుతం ఆవిష్కరణలు, మెరుగైన ఆర్థిక నిర్ణయాలకు సహాయపడుతోంది. హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత బలమైన ఫైనాన్షియల్ టెక్నాలజీ ఎకోసిస్టమ్‌లలో ఒకటిగా అభివృద్ధి చెందింది. వ్యాన్ గార్డ్, యుబిఎస్ , వెల్స్ ఫార్గో, బ్యాంక్ ఆఫ్ అమెరికా, మాస్ మ్యూచువల్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, జెపి మోర్గాన్ చేస్ , గోల్డ్ మ్యాన్ శాక్స్, సిటి గ్రూప్ లాంటి ప్రఖ్యాత ఆర్థిక సంస్థలు నగరంలో భారీ టెక్నాలజీ, అనలిటిక్స్ కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. నగరంలో ప్రస్తుతం 400 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు మూడు లక్షల మందికి పైగా వృత్తి నిపుణులకు ఉపాధి కల్పిస్తున్నాయి. తెలంగాణ ఐటీ రంగం ఎగుమతులు సంవత్సరానికి దాదాపుగా 40 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. తదుపరి దశ విస్తరణ కోసం ఏఐ సిటీ, ఫ్యూచర్ సిటీ, ఏఐకేఏఎం లను ఏర్పాటు చేస్తున్నాం. వీటి ద్వారా ఏఐ ఎకోసిస్టమ్‌ను మరింత బలోపేతం చేయడం, డిజిటల్ మౌలిక వసతులను మెరుగుపర్చడం, ఏఐ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు అవసరమైన నిపుణులను తయారు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం అని మంత్రి అన్నారు. డిజిటల్ యుగంలో సీఎఫ్ఓల పాత్ర మరింత కీలకంగా మారింది కృత్రిమ మేధ, డేటా ఆధారిత రంగాల్లో పెట్టుబడులకు మార్గనిర్దేశర చేయడంలో వారి సేవలు మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నాయని శ్రీధర్ బాబు వివరించారు. సదస్సులో మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ కె.వి.చౌదరి, ప్రముఖ నిర్మాత, విజ్ఞానజ్యోతి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ అధ్యక్షుడు దగ్గుబాటి సురేశ్ బాబు, ఫిక్కి సిఎఫ్ ఓ కౌన్సిల్ ఛైర్మన్ రజనీష్ జైన్, కో ఛైర్మన్ సుబ్బయ్య కుమార్, విజ్ఞాన జ్యోతి సంస్థల సిఇఓ, మాజీ డిజిపి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

TGTEL/26/A0320
భారతీయ వెలుగు
జాతీయ తెలుగు దిన పత్రిక
సోమవారం మార్చి 09, 2026

# అన్న ధాతలను ఆదుకోవడంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం..

- అసెంబ్లీ ప్రారంభం అయ్యే 16 లోగా రైతు భరోసా నిధులు విడుదల చేయకుంటే 16 న
- ఓసి జేఏసీ, రైతు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి...
- ఏప్రిల్ 28నకరీంనగర్ లో లక్షమంది తో రైతుల మహాగర్జన సమరభేరి.
- రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు వెల్లడి



**భారతీయ వెలుగు -కరీంనగర్:**
పాలకులు రైతు ప్రభుత్వాలు అని గొప్పలు చెప్పుకోవడం తప్ప వారిని ఆదుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు ఆరోపించారు.
దేశానికి అన్నం పెట్టే రైతన్నకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడమేమిటని ప్రశ్నించారు. ముఖ్యంగారైతులకు ,కౌలు రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధుల విడుదల లో ఎందుకు జాప్యం చేస్తోంది అని నిలదీశారు. రైతు భరోసా నిధుల కోసం సమీకరించిన 9 వేల కోట్ల రూపాయల లోంచి 4 వేల రూపాయలను కమిషన్ లకు కక్కుర్తి పడి కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేశారని ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు.
ఇటీవలే ఒక అమాత్యుడి కుమారుడి పెండ్లి కోసం కాంట్రాక్టర్లు కమిషన్ లు ఇచ్చారని అందుకే రైతు బందు కోసం కేటాయించిన నిధులను పక్కదారి పట్టించారని ఆరోపణలు పుంఖాను పుంఖాలుగా వెల్లువెత్తుతున్నాయని మండి పడ్డారు. పంట పెట్టుబడి సహాయం కోసం ఇవ్వాల్సిన రైతు భరోసా నిధులు ఇప్పటికీ విడుదల చేయలేదని మరో 15 రోజుల్లో అట్టి పంటలు కోతకు వస్తున్నాయని ఇంకెప్పుడు నిధులు విడుదల చేస్తారని రామారావు ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభమయ్యే 16 వ తేదీలోగా రైతు భరోసా నిధులు విడుదల చేయాలని పోలాడి రామారావు డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అసెంబ్లీనీ ముట్టడిస్తామని పోలాడి రామారావు హెచ్చరించారు.రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని , ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. అన్నదాతల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ 28న ఓసి ఐకాస, రైతు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కరీంనగర్ లో లక్ష మందితో ఓసి ఐకాస రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా రెడ్డి జేఏసీ చైర్మన్ అధ్యక్షతన రైతు మహాగర్జన సమర భేరి సభ నిర్వహించనున్నట్లు పోలాడి ప్రకటించారు. ఆదివారం కరీంనగర్ లో రైతు మహాగర్జనకు సంబంధించి ఐకాస రాష్ట్ర, వివిధ జిల్లాల ముఖ్య నేతల తో సన్నాహక సమావేశం, పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశ వివరాలను రామారావు మీడియా కు వివరాలు వెల్లడించారు. రామారావు మాట్లాడుతూ రైతుల పంటల పై ప్రస్తుతం అమలు జరుగుతున్న గిట్టు బాటు ధరలు అన్న దాతలకు ఏ మాత్రం ఆమోదయోగ్యంగా లేనే లేవని రైతులు పండించిన పంటలకు రైతులే గిట్టు బాటు ధరలను నిర్ణయించుకునే అవకాశం కల్పించే విధంగా జాతీయ స్థాయిలో ప్రత్యేక చట్టం తీసుకు రావాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రస్తుత పరిస్థితుల్లో కూలీల కొరత పెరుగుతోందని, ఖర్చులు బాగా పెరిగి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రైతుల వ్యవసాయరంగానికి చేయూత నిచేందుకు, గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు పెరగడం తో పాటు వ్యవసాయ రంగాన్ని బలోపితం చెయ్యాలంటే జాతీయ ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ రంగాన్ని తక్షణమే అనుసంధానం చేయాలన్నారు.
రైతు భీమా వయోపరిమితిని 70ఏళ్లకు పెంచాలని, 50ఏళ్లు నిండిన రైతులకు నెలకు కనీసం 6వేల రూపాయల పెన్షన్ సౌకర్యం కల్పించాలని, రైతుల అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు 20లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని, వివిధ ఓసి కార్పొరేషన్ల నామ మాత్రంగానే ప్రకటించిన పాలకులు నిధులు,పాలకమండల్లను నేటికీ ఏర్పాటు చేయలేదని తక్షణమే ఆయా కార్పొరేషన్ లకు నిధులు విడుదల చేసి పాలకమండల్లులను ఏర్పాటు చేయాలని,ఆర్థికంగా వెనుకబడిన అగ్రకుల పేదల సంక్షేమం కోసం జాతీయ స్థాయి ఓసి కమిషన్ ఏర్పాటు చేయాలనే తదితర డిమాండ్ల పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ 28న కరీంనగర్ లో నిర్వహించే రైతు మహాగర్జన సమరభేరి సభ ద్వారా ప్రభుత్వాల దృష్టికి తీసుకు వస్తామని ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు తెలిపారు.
పార్టీల కతీతంగా అందరినీ సభకు ఆహ్వానిస్తామని అన్ని జిల్లాలనుంచి రాష్ట్ర వ్యాప్తంగా రైతులు భారే సంఖ్యలో తరలి వచ్చేలా చూస్తామన్నారు.. ఈ సన్నాహక కార్యక్రమంలో ఓసి ఐకాస రాష్ట్ర నాయకులు అండెం రమణా రెడ్డి, మెచినేని హన్మంతు రావు, జిల్లా అంజయ్య, కొత్తకొండ రవీందర్ రావు రైతు మిత్ర ప్రజా సంఘాల సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి స్వామి రెడ్డి, రాష్ట్రవైశ్య సంఘాల జేఏసీ చైర్మన్ అయిత నాగరాజు, రావు వివిధ జిల్లాల ఐకాస, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్ పి వి)వ్యాక్సినేషన్ కేంద్రం ప్రారంభం







**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట మర్చి 8**
జమ్మికుంట సామాజిక ఆరోగ్య కేంద్రంలో డిస్ట్రిక్ట్ ఇమ్మునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ సాజిదా అతారి సూపరిండెంట్ డాక్టర్ బి రమేష్ తో కలిసి హెచ్ పి వి వాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభించారు ఈ సందర్భంగా హెచ్ పి వి వ్యాక్సినేషన్ వేసుకోవడానికి వచ్చిన బాలికలకు ఈ వ్యాక్సినేషన్ వేసుకోవడం వలన జరిగే ప్రయోజనాల గురించి వివరించారు,గర్భాశయ క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) నుంచి రక్షణ కల్పించే ప్రాథమిక నివారణ మందే 'హెచ్‌పీవీ వ్యాక్సిన్'.అని ఈ వ్యాక్సిన్ 100% సమర్థవంతంగా పనిచేస్తుంది మరియు సురక్షితమైనది అని గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో పాటు యోని, కొన్ని రకాల గొంతు క్యాన్సర్లు, జననేంద్రియ మొటిమలను నివారించడంలో కూడా ఈ వ్యాక్సిన్ తోడ్పడుతుంది అని తెలిపారు,వ్యాక్సినేషన్ వేసుకున్న బాలికలకు హెచ్ పి వి వ్యాక్సినేషన్ సర్టిఫికెట్ అందించడం జరిగింది.
ఈ వ్యాక్సిన్ మూడు నెలల పాటు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు జమ్మికుంట సామాజిక ఆరోగ్య కేంద్రంలో వేయడం జరుగుతుందని,14వ సంవత్సరం జన్మదినం జరుపుకున్న బాలికలు 15వ జన్మదినం చేసుకొనని బాలికలు ఈ వ్యాక్సిన్ వేసుకోవడానికి అర్హులని అర్హులైన బాలికలు తమ వెంట ఆధార్ కార్డు తీసుకొని వ్యాక్సిన్ వేసుకోగలరని అర్హులైన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని కోరడం జరిగింది.
ఈ కార్యక్రమంలో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వరుణ, సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ఫాతిమా,హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి,సూపర్వైజర్ అరుణ మరియు ఆరోగ్యశాఖ సిబ్బంది మంజుల, సాజిదా పర్వీన్,రజిత,రాధా, సంధ్య మరియు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అంటేనే ఇందిరమ్మ ఇళ్లు..ప్రణవ్.

- పండుగలా ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహ ప్రవేశాలు.
- లబ్ధిదారుల ఆనందోత్సవాల మధ్య గ్రామాల్లో గృహ ప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్న వొడితల ప్రణవ్..
- త్వరలోనే రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం.





**భారతీయ వెలుగు ప్రతినిధి మర్చి 8**
కాంగ్రెస్ పార్టీ అంటేనే ఇందిరమ్మ ఇళ్లు అని పేదవారి సొంతింటి కల నెరవేర్చేది కాంగ్రెస్ పార్టీ అని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.ఆదివారం రోజున హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలోని హుజూరాబాద్,జమ్మికుంట,ఇల్లందకుంట మండలాల పరిధిలోని కనుకుల గిద్ద,వావిలాల,సీతంపేట,భోగంపాడ్ గ్రామాల్లోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రణవ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు పూలమాలలతో,మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు.జీవితంలో ఇళ్లు కట్టుకుంటామా లేదా అనే ఆందోళనలో ఉండేదని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం ఇంటికి నిర్మాణానికి సహయం అందజేస్తుందని ఈ సహాయం ద్వారా తాము ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడమే కాక భరోసా కల్పించారని లబ్ధిదారులు అన్నారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ ఎన్నికల్లో గత ప్రభుత్వ నాయకులు ఓట్ల కోసం గొప్పలు చెప్పారే తప్ప ఒక్క ఇంటిని కూడా నిర్మించాలేదని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల ముందు ఏదైతే చెప్పామొ అదే చేస్తున్నామని 2ఏళ్ల కాలంలోనే సొంతింటి కల నెరవేరుస్తున్నామని రానున్న రోజుల్లో ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అర్హులైన లబ్ధిదారునికి అందజేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు,వార్డు సభ్యులు,మండల అధ్యక్షులు,టౌన్ అధ్యక్షులు,మహిళా మండల,టౌన్ అధ్యక్షురాల్లు,ఆయా గ్రామ శాఖ అధ్యక్షులు,సీనియర్ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు,మైనారిటీ నాయకులు,వార్డు అధ్యక్షులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జానం శీలం ఏకత పరిషత్ ప్రత్యేకత ....

- విద్యార్థి ఉద్యమాలు ఏబీవీపీకే సాధ్యం..



**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట మర్చి 8**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో నిర్వ హించిన విభాగ స్థాయి జ్ఞాన భారతి కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థి శక్తిని దేశ నిర్మాణానికి దారి తీసే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది.
ఈ సందర్భంగా జమ్మికుంటకు చెందిన ఆకుల రాజేందర్, పాకల రవీందర్ రెడ్డి కార్యక్రమానికి హాజరై విద్యార్థి ఉద్యమాలకు తమ పూర్తి మద్దతు ప్రకటించారు. అలాగే పెద్దపల్లి జిల్లా బీజేపీ అధ్యక్షుడు కర్ర సంజీవరెడ్డి, టంగుటూరు రాజ్ కుమార్, గొట్టముక్కల సురేష్ రెడ్డి, ఆవుల తిరుపతి, బుద్ధి చందు తదితరులు కార్యక్రమంలో పాల్గొని జ్ఞాన భారతి కార్యాలయాన్ని ప్రారంభించిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే మంచి విలువలు, క్రమశిక్షణ, దేశభక్తి భావాలు పెంపొందించుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేశవ్యాప్తంగా విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ముందుండి పనిచేస్తున్న ప్రముఖ విద్యార్థి సంస్థగా నిలిచిందన్నారు. విద్యార్థులలో జాతీయ భావన, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో ఏబీవీపీ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.
జ్ఞాన భారతి కార్యాలయం ద్వారా విద్యార్థులకు విద్యా సంబంధిత మార్గదర్శనం, పోటీ పరీక్షలకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇది కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు అవసరమైన సహాయం, సలహాలు అందించే వేదికగా ఈ కార్యాలయం ఉపయోగపడుతుందని చెప్పారు.
ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు పాల్గొని కార్యాలయ ప్రారంభోత్సవాన్ని ఘనంగా జరిపారు. కార్యక్రమం అనంతరం పాల్గొన్న వారందరూ విద్యార్థుల అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. విద్యార్థి సమాజం బలంగా ఉంటేనే దేశం బలంగా ఎదుగుతుందని నాయకులు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు.

## పోలీసులతో టచ్‌లో మావో అగ్రనేత గణపతి ?

- లొంగిపోవాలని ఇప్పటికే సిఎం, డిజిపిల వినతి

మావోయిస్టు అగ్రనేత గణపతి తెలంగాణ పోలీసుల టచ్‌లోకి వచ్చాడరిన సమాచారం. నిజానికి శనివారం లొంగిపోతాడని ప్రచారం జరిగింది. కానీ అలా జరగలేదు. అయితే వారం, పది రోజుల్లో గణపతి లొంగిపోయే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పోలీస్ బృందం నేపాల్, ఫిలిప్పీన్స్ వెళ్లనుంది. గణపతి పోలీసుల ముందు లొంగిపోతే రక్షణ కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట 130 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం సరెండర్ అయిపోయింది. మావోయిస్టులు తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా మావోయిస్టు అగ్రనేత గణపతి లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి పిలుపు ఇచ్చిన గంటల్లోనే గణపతి పోలీసుల టచ్‌లోకి వచ్చాడంటూ వార్తలు రావటం గమనార్హం. ఇకపోతే నేటితో తెలంగాణ మావోయిస్ట్ రాష్ట్ర కమిటీ అంతర్థానమైంది డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. తెలంగాణకు చెందిన 7 మంది మావోయిస్టులు మాత్రమే మిగిలి ఉన్నారని, ఆ ఏడు మంది తెలంగాణలో కాకుండా వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్నారని వెల్లడించారు. శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట 130 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం సరెండర్ అయిపోయింది. మావోయిస్టులు తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. 'మావోయిస్టు అగ్రనేత గణపతి అజ్ఞాతంలో ఉన్నారు.

## అసంఘటిత మహిళా కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

- మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి
- పట్టణ మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తా
- జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్





**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట మార్చి 8**
జమ్మికుంట పట్టణంలోని జరా ఫంక్షన్ హాల్‌లో అసంఘటిత మహిళా కార్మిక సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ హాజరై మాట్లాడారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. జమ్మికుంట పట్టణంలోని మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం తాను ప్రత్యేకంగా కృషి చేస్తానని తెలిపారు. మహిళల సమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, అవసరమైతే ఎప్పుడైనా సంప్రదించవచ్చని పేర్కొన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న హమాలీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటి సామ్రాజ్యం మాట్లాడుతూ మహిళా అభివృద్ధి జరిగితేనే కుటుంబం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. మహిళల హక్కులు, సమస్యల పరిష్కారానికి అసంఘటిత కార్మిక మహిళా సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.అసంఘటిత మహిళా కార్మిక సంఘం కన్వీనర్ అరికిల్ల స్రవంతి మాట్లాడుతూ మహిళ లేనిది మానవ సృష్టి లేదని, మహిళా శక్తిని సమాజానికి చాటాలని మహిళలకు పిలుపునిచ్చారు. కుటుంబాన్ని చక్కదిద్దే మహిళలకు సమాజాన్ని కూడా ముందుకు నడిపించే శక్తి ఉందని, మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని కోరారు.కార్యక్రమం అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిస్తున్న పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్మన్ జావేద్, మాజీ వైస్ చైర్మన్ దేశిని స్వప్న, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆవాల హరిబాబు, అసంఘటిత మహిళా కార్మిక సంఘం కో-కన్వీనర్ శనిగరం స్వప్న, మున్సిపల్ కౌన్సిలర్లు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

TGTEL/26/A0320
భారతీయ వెలుగు
జాతీయ తెలుగు దిన పత్రిక
సోమవారం మార్చి 09, 2026

# మహిళా పారిశుద్ధ్య కార్మికులకు ఘన సన్మానం

**– చీరను బహుమతిగా అందజేసిన వార్డు కౌన్సిలర్ ఏనుగు జ్యోతి**



**భారతీయ వెలుగు ప్రతినిధి వేములవాడ**
వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజ్‌పల్లి గ్రామంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2వ వార్డ్ కౌన్సిలర్ ఏనుగు జ్యోతి తిరుపతి రెడ్డి మున్సిపల్ మహిళా పారిశుధ్య కార్మికులను శాలువాలతో ఘనంగా సన్మానించి, బహుమతిగా చీరలను అందజేశారు. మహిళల సేవలు సమాజానికి ఎంతో ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం, మాజీ ఉప సర్పంచ్ నల్ల సతీష్ రెడ్డి, గుడిసె అనిల్ కుమార్,వికుర్తి సాయి బాబ, అయిత వెంకన్న,బాలయ్య, దాసు ప్రకాష్,చోటు,అనిల్ రెడ్డి, ఖయీమ్, మల్లారం తిరుపతి వార్డ్ యువకులు పాల్గొన్నారు.

# అక్రమ సంబంధం వివాదం...

- మోహన్ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుల అరెస్ట్, రిమాండ్
- వేములవాడ డిఎస్పీ శ్రీనివాసులు



**భారతీయ వెలుగు ప్రతినిధి వేములవాడ**
వేములవాడ పట్టణంలోని సిద్ధార్థ లాడ్జిలో ఈనెల 4న జరిగిన భూక్య మోహన్ హత్య కేసును టౌన్ పోలీసులు ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. హత్య కేసు పై పట్టణ పోలీస్ స్టేషన్ లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పీ మాట్లాడుతూ మోహన్‌కు అంజనీ నగర్‌కు చెందిన నర్స్ బైరి శారదతో అక్రమ సంబంధం ఉండగా, డబ్బుల కోసం తరచు బెదిరింపులకు పాల్పడడంతో ఆమె తన భర్త బైరి శేఖర్, గుండం రవితో కలిసి పథకం రచించి నైలాన్ తాడుతో ఉరివేసి హత్య చేసినట్లు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి బైక్, నైలాన్ తాడు, చాకు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. కేసును ఛేదించిన పట్టణ సీఐ బి.వీరప్రసాద్, ఎస్సైలు రామ్మోహన్ గౌడ్, ప్రేమానందం, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా మున్సిపల్ సిబ్బంది

**రంగారెడ్డి జిల్లా: చంపపేట్ మార్చ్ 8/ భారతీయ వెలుగు ప్రతినిధి**



మార్చి 8, 2026న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ మున్సిపల్ సంఘం(టి.ఏం.ఎస్)ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిత్రం.సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి మహిళా కార్మికులతో కలిసి మహిళా దినోత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు. అనంతరం మహిళలకు ఆటపాటలతో సంబరాలను మరింత ఉత్సాహంగా జరిపించారు.ఈ సందర్భంగా అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ పూర్వం ఇంటికే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాల్లో పురుషులకు సమానంగా ముందంజలో ఉన్నారని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలోనే కాకుండా రాజకీయాలు, పారిశ్రామిక, క్రీడా మరియు ఇతర రంగాల్లో కూడా మహిళలు తమ శక్తి సామర్థ్యాలను నిరూపించుకుంటూ సమాజంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని మహిళల గొప్పతనాన్ని కొనియాడారు.
ఈ కార్యక్రమం అనంతరం తెలంగాణ మున్సిపల్ సంఘం (టి.ఏం.ఎస్) తరపున మహిళా కార్మికులకు సంఘం అధ్యక్షులు చీరలు పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు శరత్, సతీష్, శివ, శ్రీకాంత్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మహిళా కార్మికులు బాలమ్మ, నీలమ్మ, రేణుక, మాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో చిన్నారుల మిస్సింగ్ కలకలం పదేళ్ల లోపు ఐదుగురు చిన్నారలు అదృశ్యం

**– రంగంలోకి దిగిన పోలీసులు**

కామారెడ్డి పట్టణంలోని గంటల వ్యవధిలోనే చిన్నారుల మిస్సింగ్ కలకలం రేపుతోంది. 24 గంటల వ్యవధిలో ఐదుగురు చిన్నారులు అదృశ్యం కావడం ఆందోళనకు గురిచేస్తోంది. అదృశ్యం అయిన వాళ్ళంతా 10 ఏళ్ల లోపు పిల్లలే. కామారెడ్డి పట్టణంలోని సంగి కాలనీకి చెందిన సింహాద్రి(10), విజయ్(9) అనే ఇద్దరు చిన్నారులు శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సాయంత్రం దాటినా పిల్లలు రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు.. ఆర్బీ నగర్ కాలనీకి చెందిన అక్కాచెల్లెళ్లు అదృశ్యం కావడం మరింత భయాందోళనకు గురిచేస్తోంది. సీపాత్(8), అయాత్(7), మరియం(5) అనే ముగ్గురు పిల్లలను వారి తండ్రి ఆటోలో తీసుకువెళ్లి ఒక షాపు వద్ద వదిలిపెట్టాడు. కొద్దిసేపటి తర్వాత తిరిగి వచ్చి చూసేసరికి అక్కడ వాళ్లు కనిపించకుండా పోయారు. చిన్నారు అదృశ్యంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. బాధిత కుటుంబాల ఇంటికి వద్దకు వెళ్లిన కామారెడ్డి అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి వివరాలు సేకరించారు. కామారెడ్డి పట్టణ సీఐ నరహిరి, కామారెడ్డి రూరల్ సీఐ రామన్ ఆధ్వర్యంలో పోలీసులు 3 బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

# కీ.శేలు ఆకు మడుపుల రజనీకాంత్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తాం.

**– ట్రస్ట్ చైర్మన్ ఆకుమడుపుల నరేంద్ర స్వరూప్.**



**భారతీయ వెలుగు కరీంనగర్ మార్చి 8**
కీ.శే.లు ఆకుమడుపుల రజనీకాంత్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని ట్రస్ట్ చైర్మన్ ఆకుమడుపుల నరేంద్ర స్వరూప్ తెలిపారు. తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ (ఎల్ఎండి కాలనీ) లో కరీంనగర్ జిల్లా స్వాతంత్ర సమరయోధుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థుల కోసం ఆదివారం రోజున కీ.శే.లు ఆకుమడుపుల రజనీకాంత్ సేవా ట్రస్ట్ 8 క్వింటాళ్ల బియ్యాన్ని పంపిణీ చేసింది. ఈ సందర్భంగా సేవా ట్రస్టు చైర్మన్ ఆకు మడుపుల నరేంద్ర స్వరూప్ , హనుమంతు , కల్లూరి సోమనాదం లు మాట్లాడుతూ ఆకుమడుపుల రజనీకాంత్ జీవించి ఉన్న కాలంలో ఎన్నో స్వచ్ఛంద సేవా కార్యక్రమాల కోసం తన వంతు చేయుతని చ్చారన్నారు . ఆపదల్లో, కష్టాల్లో ఉన్న ఎంతోమంది అభాగ్యులను, నిస్సహాయులను ఆదుకోవడానికి రజినీకాంత్ తగిన సహాయ సహకారాలు అందించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. చిన్న వయసులో రజినీకాంత్ అకాల మరణం చెందడం బాధాకరమని , ఆయన మా కుటుంబం మధ్య లేకపోవడం ఎంతో వేదన కలిగిస్తుందన్నారు. రజినీకాంత్ జీవితం చెరిగిపోని జ్ఞాపకం లాంటిదని , అందుకే ఆయన సేవ గుణం కొనసాగించాలనే ఆశయంతో, స్వచ్ఛంద సేవ కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలనే సంకల్పంతో ట్రస్టును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయన్నారు. ప్రోగ్రాం అనంతరం ట్రస్టు సభ్యులు విద్యార్థులకు అన్న ప్రసాద వితరణ చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సిబ్బందిని సన్మానించారు. ఇట్టి కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఆకు మడుపుల శ్రీనివాస్, ఆకుమడుపులసంధ్యారాణి-రజనీకాంత్, కొట్టాల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ సోమనాదం కల్లూరి, టీఎన్జీవో నేతలు అంబటి నాగరాజు , పోలు కిషన్ , మహాత్మా నగర్ గ్రామ సర్పంచ్ పొన్నాల సంపత్, ఉప సర్పంచ్ కేతిరెడ్డి అంజిరెడ్డి , వార్డు సభ్యులు పొన్నాల తిరుపతి, మహిళా వార్డు సభ్యులు , మానసిక వికలాంగుల పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళా శక్తి -- గ్రామాభివృద్ధికి మార్గదర్శి

**– రుక్మాపూర్ , కాట్నపల్లి లో మహిళా సాధికారత అవగాహన కార్యక్రమం**






**భారతీయ వెలుగు కరీంనగర్ మార్చి 8**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ ఑ సైన్స్ కళాశాల, కరీంనగర్ ఎన్ ఎస్ ఎస్ యూనిట్-2 , యూనిట్-5 ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా మహిళా సాధికారత ర్యాలీ, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలతో సమావేశం, మహిళల హక్కులు , ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం, గ్రామ మహిళలతో పరస్పర చర్చ వంటి కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం మహిళా సాధికారత అంశంపై సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో డా. మసరత్ ఆరోగ్యం , వ్యక్తిగత శుభ్రత గురించి సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు అవగాహన కల్పించారు. గ్రామీణ మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం ద్వారా కుటుంబ ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని వివరించారు.
యూనివర్సిటీ ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ తరపున డా. విజయ్ కుమార్ పాల్గొని ఎన్ ఎస్ ఎస్ కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరించారు.
ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కలువకుంట రామకృష్ణ ఫోన్ ద్వారా సందేశం పంపిస్తూ, మహిళలు సమాజ అభివృద్ధికి ప్రధాన శక్తి అని పేర్కొన్నారు. మహిళలకు విద్య, ఆరోగ్యం, ఆర్థిక స్వావలంబన కల్పించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాలని సూచించారు.
కార్యక్రమం అనంతరం డా. మసరత్, రుక్మాపూర్ గ్రామ , డా. విజయ్ కుమార్ ను సన్మానించారు.
ఈ సందర్భంగా ఎన్ ఎస్ ఎస్ యూనిట్-2 ప్రోగ్రామ్ ఆఫీసర్ జి. రాజేందర్ మాట్లాడుతూ మహిళల సాధికారత అంటే కేవలం ఆర్థిక స్వాతంత్ర్యం మాత్రమే కాకుండా విద్య, ఆరోగ్యం, స్వాభిమానంతో ముందుకు సాగడం కూడా అవసరమని అన్నారు. మహిళలు సమాజంలో సమాన హక్కులతో ముందుకు రావడానికి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు గ్రామాల్లో ప్రజల సమస్యలను అర్థం చేసుకొని, సమాజ అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. మహిళలు కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజానికి కూడా దారిచూపే నాయకులని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు, గ్రామ మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాలవికాస ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు

**– ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్**








**భారతీయ వెలుగు ని ప్రతినిధి జమ్మికుంట మార్చి 8**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బాల వికాస స్వచ్ఛంద సంస్థ అసంఘటిత కార్మిక సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. కుటుంబాన్ని సంరక్షిస్తూ సమాజ అభివృద్ధికి మహిళలు అహర్నిశలు కృషి చేస్తున్నారని, నేటి కాలంలో మహిళలు విద్య, వైద్యం, వ్యాపారం, రాజకీయాలు, క్రీడలు వంటి అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. మహిళలు ధైర్యంగా ముందుకు సాగితే కుటుంబం మాత్రమే కాకుండా సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు.
మహిళలకు విద్య, ఆరోగ్యం, ఆర్థిక స్వావలంబన ఎంతో ముఖ్యమని పేర్కొంటూ మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా బలపడాలని సూచించారు. ప్రభుత్వం మహిళల సాధికారత కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకొని స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని ఆయన కోరారు. మహిళలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండి సమాజంలో గౌరవంగా జీవించాలన్నారు.
మహిళల భద్రత, గౌరవం కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడడంలో వారి పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. చిన్నారుల విద్యాభివృద్ధికి కూడా తల్లుల పాత్ర ఎంతో గొప్పదని ఆయన అన్నారు.
ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలను శాలువాలతో సత్కరించి అభినందించారు. మహిళల సేవలను గుర్తించి వారికి అభినందనలు తెలియజేశారు. మహిళా సంఘాల సభ్యులు తమ అనుభవాలను పంచుకుంటూ మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో బాల వికాస స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, అసంఘటిత కార్మిక సంఘం నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని మహిళా దినోత్సవాన్ని ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల సాధికారత, సమాన హక్కులు, ఆర్థిక స్వావలంబన వంటి అంశాలపై చర్చలు నిర్వహించడం ద్వారా మహిళలకు మరింత ప్రోత్సాహం లభించిందని నిర్వాహకులు తెలిపారు. మహిళలు ముందుకు సాగితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని, ప్రతి ఇంట్లో మహిళలకు గౌరవం కల్పించడం ద్వారా సమానత్వ సమాజాన్ని నిర్మించవచ్చని కార్యక్రమంలో పాల్గొన్న పలువురు అభిప్రాయపడ్డారు.

# సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం -- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**మహేశ్వరం: మార్చి 8 భారతీయ వెలుగు ప్రతినిధి.**
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ భవన్‌లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ సురభి వాణీ దేవి, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహిళా నాయకులతో కలిసి కేక్ కట్ చేసి మహిళా సోదరీమణులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి భారీగా మహిళలు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళల సాధికారతకు, సమాన హక్కులకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని ఆమె పేర్కొన్నారు. మహిళలు మరింత ధైర్యంగా ముందుకు సాగి సమాజ నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.అనంతరం మహిళల సాధికారతకు కృషి చేస్తున్న నాయకులుగా గుర్తింపుపొందిన సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, సురభి వాణీ దేవి, సునీత లక్ష్మారెడ్డిలను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# శ్రీ గట్టు మల్లన్న స్వామి దేవాలయానికి బెంచీలు బహుకరణ





**భారతీయ వెలుగు ప్రతినిధి ఇల్లందకుంట మార్చి 8**
కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం పరిధిలోని రాచపల్లి గ్రామంకు చెందిన దాతృత్వ కుటుంబం ఒక గొప్ప సేవా కార్యక్రమాన్ని నిర్వహించింది. గ్రామానికి చెందిన కీర్తిశేషులు మూడెత్తుల పెద్ద ఐలయ్య ఐలమ్మ వారి పవిత్ర జ్ఞాపకార్థం రాచపల్లి సమీపంలోని మల్లన్న పల్లె గట్టు మల్లన్న స్వామి దేవాలయం ఆవరణలో భక్తుల సౌకర్యార్థం కూర్చునేందుకు ప్రత్యేకంగా 2 బెంచ్‌లను బహుకరించడం జరిగింది.
ఈ సేవా కార్యక్రమాన్ని రాచపల్లి గ్రామానికి చెందిన చెన్నబోయిన బక్కమ్మ వారు తమ భర్త కీర్తిశేషులు కొమురయ్య జ్ఞాపకార్థంగా నిర్వహించడం విశేషం. దేవాలయానికి నిత్యం వచ్చే భక్తులు, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, పిల్లలు కొంతసేపు విశ్రాంతి తీసుకునేందుకు అనువుగా ఉండాలని భావించి ఈ బెంచ్‌లను ఏర్పాటు చేశారు.
గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మల్లన్న పల్లె గట్టు మల్లన్న స్వామి దేవాలయం ప్రాంతానికి ప్రతి రోజు అలాగే పండుగ రోజుల్లో పెద్ద సంఖ్యలో భక్తులు దర్శనానికి వస్తుంటారు. ప్రత్యేకంగా జాతరలు, పూజా కార్యక్రమాల సమయంలో భక్తుల రద్దీ మరింతగా ఉంటుంది. అలాంటి సందర్భాల్లో భక్తులు కూర్చునేందుకు సరైన సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించిన దాత కుటుంబం ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టింది.
ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ పెద్దలు మూడెత్తుల పెద్ద ఐలయ్య. ఐలమ్మ గ్రామంలో సేవాభావంతో జీవించి ప్రజల మన్ననలు పొందారని చెప్పారు. వారి జ్ఞాపకార్థం సమాజానికి ఉపయోగపడే విధంగా ఏదైనా చేయాలని భావించి దేవాలయానికి వచ్చే భక్తుల కోసం 2 బెంచ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇదే విధంగా తమ కుటుంబ కీర్తిశేషులు కొమురయ్య కూడా భక్తి భావంతో దేవాలయ సేవలో ఎప్పుడూ ముందుండేవారని, ఆయన జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం చేపట్టడం తమకు ఆనందంగా ఉందన్నారు.
దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామస్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి దేవాలయ అభివృద్ధికి సహకరించడం ఎంతో అభినందనీయమని అన్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పించడం ద్వారా దేవాలయ ప్రాంగణం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తాయని చెప్పారు.
గ్రామ పెద్దలు మాట్లాడుతూ దేవాలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాకుండా గ్రామ ప్రజల ఆధ్యాత్మిక కేంద్రాలుగా నిలుస్తాయని తెలిపారు. అలాంటి పవిత్ర స్థలాల్లో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం ద్వారా దేవాలయాల ప్రాముఖ్యత మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. దాత కుటుంబం చేసిన ఈ సేవ గ్రామానికి గర్వకారణమని అన్నారు.
దేవాలయానికి విచ్చేసే భక్తులు కూడా ఈ బెంచ్‌ల ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేశారు. పూజలు చేసిన తర్వాత కొంతసేపు విశ్రాంతి తీసుకునేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు దీని ద్వారా ఎంతో ప్రయోజనం పొందుతారని అన్నారు.
ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, దేవాలయ కమిటీ సభ్యులు, యువకులు, భక్తులు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అందరూ కలిసి దాత కుటుంబాన్ని అభినందించి వారి సేవాభావాన్ని ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా దేవాలయ అభివృద్ధికి గ్రామస్థులు ఇలాగే సహకరించాలని నిర్ణయించుకున్నారు.
ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పులకు దారి తీస్తాయని, గ్రామ అభివృద్ధి ఆధ్యాత్మిక చైతన్యానికి ఇవి ఎంతో దోహదపడతాయని పాల్గొన్న వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. భక్తులకు

# కీ.శే. రావికంటి అనసూర్య (88) నేత్రదానం -- ఇద్దరికి చూపు ప్రసాదం

– సేవా భావానికి నిలువెత్తు నిదర్శనం... కుటుంబ సభ్యులను అభినందించిన సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు





**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట మార్చి 8**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని కోరపల్లి రోడ్‌కు చెందిన కీ.శే. రావికంటి అనసూర్య గారు (88) 08--03--2026 ఆదివారం రోజు ఉదయం సుమారు 11 గంటల 40 నిమిషాలకు వృద్ధాప్యంతో మృతి చెందారు. ఆమె మరణానంతరం కూడా సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో కుటుంబ సభ్యులు గొప్ప మనసుతో నేత్రదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయం.
పబ్బతి రాజగోపాల్, వంగల రమేష్ అందించిన సమాచారం మేరకు సదాశయ ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మచ్చగిరి నరహరి, డీలర్ గర్రెపల్లి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు నేత్రదానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. వారి సూచనలను స్వీకరించిన కుటుంబ సభ్యులు నేత్రదానం చేయడానికి అంగీకరించారు.
దీంతో సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి ఆధ్వర్యంలో వరంగల్ ఎల్.వి.పీ టెక్నీషియన్ నరేందర్ సహకారంతో నేత్రాలను సేకరించి, హైదరాబాద్‌లోని ఎల్.వి.పీ ఐ బ్యాంక్‌కు పంపించారు. కీర్తిశేషులు రావికంటి అనసూర్య గారి నేత్రదానంతో ఇద్దరు అంధులకు తిరిగి చూపు లభించనుంది.
ఈ సందర్భంగా అనసూర్య గారి కుమారులు రావికంటి కృష్ణమూర్తి -- పద్మ, రవీందర్ -- సుజాత, వెంకటేశ్వర్లు -- సుమలత, కీర్తిశేషులు లక్ష్మీరాజం -- విజయలక్ష్మి, కీర్తిశేషులు కేదారి -- శోభారాణి, కీర్తిశేషులు ప్రకాష్ -- శ్రీదేవి లు, కూతుళ్లు మరియు అల్లుళ్లు తాటి పెల్లి అండాలు -- వెంకటేష్, భూపతి పద్మ -- రాజన్నలు నేత్రదానం కార్యక్రమానికి సహకరించారు.
అలాగే ఈ కార్యక్రమంలో డీలర్ గర్రెపల్లి వెంకటేశ్వర్లు, చిటి కేసి శివానందయ్య, ముత్యాల జగదీశ్వర్, చిదురాల శ్రీనివాస్ తదితరులు సహకరించారు.
ఈ సందర్భంగా సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి, ముఖ్య సలహాదారులు నూక రమేష్, గౌరవ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ప్రచార కార్యదర్శి వాసు, లగిశెట్టి చంద్రమౌళి తదితరులు కుటుంబ సభ్యులను అభినందిస్తూ, సమాజానికి ఆదర్శంగా నిలిచిన ఈ సేవాభావాన్ని కొనియాడారు.
కీర్తిశేషులు రావికంటి అనసూర్య నేత్రదానం సమాజానికి గొప్ప సందేశం ఇచ్చిందని, మరణానంతరం కూడా మానవ సేవ చేయవచ్చని ఈ ఘటన మరోసారి చాటిచెప్పిందని వారు తెలిపారు.

# వీణవంక మండలం మహిళా మణులకు ఘన సన్మానం -- అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ



**భారతీయ వెలుగు ప్రతినిధి మార్చి 8**
హుజురాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం హుజురాబాద్ ఏసీపీ మాధవి పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా వీణవంక మండలానికి చెందిన వివిధ గ్రామాల మహిళా సర్పంచులు, ఉప సర్పంచులు మరియు సమాజంలోని పలు రంగాలలో ప్రతిభ కనబరిచి సేవలు అందించిన మహిళలను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.
కార్యక్రమంలో పాల్గొన్న మహిళలను అభినందిస్తూ ఏసీపీ మాధవి మాట్లాడుతూ మహిళలు నేటి సమాజంలో అన్ని రంగాలలో ముందంజలో ఉన్నారని అన్నారు. విద్య, ఉద్యోగాలు, వ్యాపారం, రాజకీయాలు, క్రీడలు, సామాజిక సేవ వంటి అనేక రంగాలలో మహిళలు తమ ప్రతిభను చాటుకుంటూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు ధైర్యంగా ముందుకు సాగి తమ లక్ష్యాలను సాధించాలని, సమాజ అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని ఆమె సూచించారు.
అదేవిధంగా మహిళలు కుటుంబ బాధ్యతలను నిర్వహించడంలోనే కాకుండా సమాజ నిర్మాణంలో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని ఆమె తెలిపారు. కుటుంబాన్ని చూసుకుంటూనే జీవితంలో ముందుకు సాగుతూ తమ ప్రతిభను ప్రపంచానికి చాటాలని మహిళలకు ప్రోత్సాహం ఇచ్చారు. మహిళల భద్రత, గౌరవం కాపాడటానికి పోలీస్ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని, మహిళలు ఎలాంటి సమస్యలు ఎదురైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని ఆమె సూచించారు.
ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ప్రముఖ కవి, గాయకుడు గోనెల సమ్మన్న ముదిరాజ్, గాయకుడు దరిపెల్లి మురళి, గాయకుడు పొట్టాల శివకుమార్ తమ పాటలతో మహిళలను కొనియాడుతూ సభను అలరించారు. వారి గాన ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళల గొప్పతనం, తల్లి త్యాగం, మహిళా శక్తి గురించి పాటల రూపంలో వివరించి అందరినీ ఆకట్టుకున్నారు.
కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు కూడా తమ అనుభవాలను పంచుకుంటూ మహిళల సాధికారతపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. మహిళలు విద్యను అభ్యసించి ఆర్థికంగా బలపడితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.
ఈ కార్యక్రమంలో జమ్మికుంట గ్రామీణ సీఐ, లక్ష్మీనారాయణ. వీణవంక ఎస్సై, ఆవుల తిరుపతి హుజురాబాద్ డివిజన్‌కు చెందిన పోలీస్ అధికారులు, సిబ్బంది, వివిధ గ్రామాల మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పలువురు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రపతినే అవమానిస్తారా ?

**– ఇది సిగ్గుచేటైన విషయంగా పరిగణిస్తున్నాం**
**– ముర్ముకు బెంగాల్‌లో అవమానంపై మమతపై మోడీ ఆగ్రహం**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పశ్చిమబెంగాల్‌లో పాల్గొనాల్సిన అంతర్జాతీయ సంతాల్ కాన్ఫరెన్స్ వేదికను మార్చడం, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆ కార్యక్రమానికి గైర్హాజరు కావడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర స్థాయిలో స్పందించారు. ఇది సిగ్గుచేటని, మునుపెన్నడూ జరగలేదని టీఎంసీ పైన, మమతా బెనర్జీ ప్రభుత్వంపైన మండిపడ్డారు. 'ఇది సిగ్గుచేటు వ్యవహారం. గతంలో ఎన్నడూ ఇలా జరగలేదు. ప్రజాస్వామ్యం, గిరిజన వర్గాల సాధికారతకపై నమ్మకం ఉన్న ప్రతి ఒక్కరి నైతికస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఈ చర్య ఉంది. గిరిజన కమ్యూనిటీకి చెందిన రాష్ట్రపతి వెలిబుచ్చిన ఆవేదన దేశ ప్రజల మనసుల్లో ఆపార దుఃఖాన్ని కలిగించింది' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మోదీ ట్వీట్ చేశారు. పశ్చిమబెంగాల్‌లోని టీఎంసీ ప్రభుత్వం అన్ని హద్దులు అతిక్రమించిందనీ, రాష్ట్రపతికి జరిగిన అవమానానికి ప్రభుత్వ యంత్రాగానిదే బాధ్యత అని అన్నారు. ఉత్తర బెంగాల్‌లో అంతర్జాతీయ ఆదివాసీ సదస్సుకు హాజరయ్యేందుకు రాష్ట్రపతి సిలిగురికి వెళ్లారు. ప్రోటోకాల్ ప్రకారం రాష్ట్రపతికి ముఖ్యమంత్రి కానీ, మంత్రులు కానీ, సీనియర్ అధికారులు కానీ స్వాగతం పలకాల్సి ఉంది. అయితే అధికారికంగా స్వాగతించడానికి ప్రభుత్వం తరఫున ఎవరూ రాలేదు. ముందుగా అనుకున్న సదస్సు వేదికకు భద్రతా కారణాలతో ప్రభుత్వం అనుమతి కూడా ఇవ్వలేదు. ఈ పరిణామాలపై రాష్ట్రపతి అసహనం వ్యక్తం చేశారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా 2కే రన్

- శ్రీ చైతన్య పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహణ
- జెండా ఊపి ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు



**భారతీయ వెలుగు ప్రతినిధి, వేములవాడ**
వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం 2కే రన్ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. మహిళా సాధికారత, ఆరోగ్యంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో నిర్వహించిన ఈ రన్‌లో విద్యార్థినులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ బి. వీరప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు, ఏజీఎం ముద్రకోల రాజు, ప్రిన్సిపాల్ సుధేష్ కుమారి, కౌన్సిలర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా రాజరాజేశ్వరి క్లబ్ సన్మానం



**భారతీయ వెలుగు కరీంనగర్ మార్చి 8**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా లైన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ రాజరాజేశ్వరి క్లబ్ చే బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయలో మహిళలను రాజరాజేశ్వరి లైన్స్ క్లబ్ అధ్యక్షులు నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సీనియర్ సభ్యులు రాళ్ల బండి శశికళ శంకర్ ప్రసాద్ రెడ్డి, ఉపాధ్యక్షులు చాడ విమల మల్లారెడ్డి, కర్ర విద్యాసాగర్ రెడ్డి,లైన్ లేడీ నరహరి లక్ష్మి,పాల్గొన్నారు,

# మహిళా పోలీసులకు ఘన సన్మానం



**భారతీయ వెలుగు ప్రతినిధి వేములవాడ**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ సిబ్బంది రేణుకను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకట్రాజం మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండి సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ అబ్దుల్ మజీద్, పోలీస్ సిబ్బంది రాజశేఖర్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

– ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**భారతీయ వెలుగు ప్రతినిధి వేములవాడ**
వేములవాడ మున్సిపల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని త్రినేత్ర ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల కోసం ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు, పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వేసిన అందమైన ముగ్గులను, నిర్వహించిన ఆటల పోటీలను ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరిశీలించి, పోటీల్లో పాల్గొన్న మహిళలను అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కౌన్సిలర్లు అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉచిత హెచ్‌పీవీ' వ్యాక్సినేషన్ డ్రైవ్ గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రి లో ప్రారంభం

» ఆడబిడ్డలకు.రక్షణ కవచం గర్భాశయ క్యాన్సర్ కు చెక్






**గజ్వేల్ మార్చి 08, భారతీయ వెలుగు**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ నందు ఆదివారం “అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని 14 నుండి 15 సంవత్సరాల లోపు బాలికలకు హెచ్ .పి.వి (ఉమెన్ పాపిలోమా వైరస్)టీకా గర్భాశయ క్యాన్సర్ నివారణకు కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన- ప్రగతి పాలన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా 15 సంవత్సరాల లోపు మహిళలకు గర్భాశయ క్యాన్సర్ నివారణ వ్యాక్సిన్ ఇచ్చే కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా... గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన ,రవీందర్. స్థానిక వార్డు కౌన్సిలర్ బొగ్గుల స్వప్న,హెచ్. పి. వి. వ్యాక్సిన్ కేంద్రాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన దేశ ప్రగతి నివేదికలో మహిళలకు గర్భాశయ క్యాన్సర్ చాలామంది చనిపోతున్నారని గ్రహించి 14 నుండి 15 సంవత్సరాలు లోపు బాలికలకు ఒక డోసు హెచ్. పి. వి. వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా గర్భాశయ క్యాన్సర్ కు చెక్ పెట్టవచ్చునన్నారు చిన్న వయసులోనే ఈ టీకా తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ ను నివారించవచ్చునన్నారు గజ్వేల్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ హెచ్. పి. వి ఈ టీక వల్ల ఎలాంటి దుష్పరిణామాలు ఉండయని, ఇది మన హాస్పిటల్ లో అందుబాటులో ఉంటుందని, రుతుస్రావం జరుగుతున్న సమయంలో కూడా ఈ టీకా తీసుకోవచ్చునని, చిన్న వయసులోనే ఈ టీకా తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో గర్భాశయం ముఖద్వారా క్యాన్సర్ ముప్పును సమర్థవంతంగా అరికట్టవచ్చునని, మహిళల ఆరోగ్య రక్షణలో ఈ కార్యక్రమం ఒక మైలురాయిగా నిలుస్తుంది అన్నారు. ఈ టీకా పూర్తిగా సురక్షమైందని, గర్భాశయ క్యాన్సర్ కు చెక్ పెట్టవచ్చునని అభివర్ణించారు . ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లు, హాస్పిటల్ ఆర్.ఎం.ఓ డాక్టర్ రాము డాక్టర్ శ్రీధర్ డాక్టర్ ప్రణయ శ్రీరిగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బల్బేర్ సింగ్ అహ్మదిపుర్ పురప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రణయ్ రాజ్, హాస్పిటల్ హెల్త్ ఇన్స్పెక్టర్ లక్ష్మి, హాస్పిటల్ ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సింగ్ ఆఫీసర్ మహారాజ్ భాను, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్, శ్రీరిగిరిపల్లి, అహ్మదిపుర్ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు మంజుల, స్వప్న, సుజాత,రాణి సంతోష , జుబేదా బేగం , మహేశ్వరి హాస్పిటల్స్ పారామెడికల్, మరియు సానిటరీ సిబ్బంది, బాలికల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేసినారు.

# గజ్వేల్‌లో అడ్డా కూలీల మధ్య తీవ్ర ఉద్రిక్తత

» ఘర్షణకు దారితీసిన స్థానిక, ఇతర రాష్ట్రాల కూలీల వివాదం.

» సంబంధిత అధికారులు, పోలీసులు వెంటనే జోక్యం చేసుకొని ఇరు వర్గాలతో చర్చలు జరపాలి.





**గజ్వేల్, మార్చి 08, భారతీయ వెలుగు**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో అడ్డా కూలీల మధ్య నెలకొన్న విభేదాలు ఆదివారం ఉదయం తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. పట్టణంలోని ఇందిరా పార్క్ చౌరస్తాలో రోజువారీ పనుల కోసం వేచి ఉండే కూలీల మధ్య జరిగిన ఘర్షణ స్థానికంగా కలకలం రేపింది. గజ్వేల్ పట్టణంలోని ఇందిరా పార్క్ చౌరస్తా ప్రధాన కూడలి కావడంతో, ప్రతిరోజూ ఉదయం గజ్వేల్ చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే కూలీలతో పాటు, వివిధ రాష్ట్రాల (వలస) నుంచి వచ్చిన కూలీలు ఇక్కడ పని కోసం ఎదురుచూస్తుంటారు. అయితే, గత కొంతకాలంగా పనుల కేటాయింపు విషయంలో స్థానిక కూలీలకు, ఇతర రాష్ట్రాల కూలీలకు మధ్య చిన్నపాటి వివాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఇరు వర్గాల మధ్య మాటల యుద్ధం మొదలై, అది కాస్తా ఘర్షణకు దారితీసింది. గజ్వేల్ చుట్టుపక్కల గ్రామాలకు చెందిన కూలీలు ఆగ్రహంతో ఇతర రాష్ట్రాల కూలీలను కర్రలతో తరిమికొట్టారు. ఈ హఠాత్ పరిణామంతో చౌరస్తాలో భయాందోళనలు నెలకొన్నాయి. ఈ గొడవలు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మరింత తీవ్ర రూపం దాల్చే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కావున, సంబంధిత అధికారులు, పోలీసులు వెంటనే జోక్యం చేసుకొని ఇరు వర్గాలతో చర్చలు జరపాలని వారు కోరుతున్నారు. వలస కూలీలకు, స్థానిక కూలీలకు మధ్య నెలకొన్న సమస్యను పరిష్కరించి, అందరికీ సమానంగా న్యాయం జరిగేలా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు

# విద్యాశాఖ పోర్టల్‌లో ‘పద్మశాలి’ ఆప్షన్ చేర్చండి

» మంత్రి పొన్నంకు పద్మశాలి మేధావుల ఫోరం వినతి

» 8 లక్షల, విద్యార్థులు నమోదు చేసుకోలేక ఇబ్బందులు ......




**హైదరాబాద్ ప్రతినిధి మార్చ్ 8 భారతీయ వెలుగు**
పాఠశాల విద్యాశాఖ పోర్టల్‌లో పద్మశాలి సామాజిక వర్గానికి ఎదురవుతున్న సాంకేతిక సమస్యను వెంటనే పరిష్కరించాలని పద్మశాలి మేధావుల ఫోరం (గ్రా×ఖీ) ప్రతినిధులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కోరారు. ఈ మేరకు ఆదివారం వారు మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు.
ప్రస్తుతం పాఠశాలల్లో విద్యార్థుల కుల వివరాల సేకరణ జరుగుతోందని, అయితే విద్యాశాఖ పోర్టల్‌లోని డ్రాప్-డౌన్ మెనూలో ‘సబ్-కాస్ట్’ విభాగంలో “పద్మశాలి” అనే ఆప్షన్ కనిపించడం లేదని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జీవో నెం.16 (తేదీ: 11.03.2015) ప్రకారం బీసీ-బీ జాబితాలో సీరియల్ నెం. 17లో ఉన్న పద్మశాలి కులానికి చెందిన సుమారు 8 లక్షల కుటుంబాల విద్యార్థులు తమ వివరాలను నమోదు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వెంటనే పోర్టల్‌లో మార్పులు చేసి పద్మశాలి ఆప్షన్‌ను చేర్చాలని ఫోరం ప్రధాన కార్యదర్శి ఏలే వెంకటనారాయణ కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్.. వెంటనే ఈ అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి కత్తుల సుదర్శన్‌లికల్లెపల్లి రాజు నేత,ముషీరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు అతినగరం సురేష్, అయోధ్య పద్మశాలి అన్నదాన సత్రం ప్రధాన కార్యదర్శి అనిల్ వైద్య, జెపిఎస్ ఐటీ వింగ్ అధ్యక్షులు బండారు రాజేంద్ర ప్రసాద్, బొడ్ల తిరుపతి, ఏబీపీఎస్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన వంటేరు ప్రతాప్ రెడ్డి

» కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి మహిళలకు మోసం చేశారు

» మహిళలకు ఇచ్చిన హామీల అమలులో అన్నింట విఫలం

» మహిళలంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి రేవంత్ రెడ్డికి చిన్న చూపు



**గజ్వేల్ మార్చి 08 భారతీయ వెలుగు**
మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం గజ్వేల్ లోని క్యాంపు కార్యాలయంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ ,వైస్ చైర్మన్లతో పాటు మహిళా కౌన్సిలర్లకు మరియు బిఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాలతో సత్కరించిన గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ సృష్టికి మూలమైన స్త్రీమూర్తులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు మహిళలు బాగుంటేనే ఆ కుటుంబం, రాష్ట్రం, దేశం బాగుంటుందని తెలిపారు. ఎక్కడ స్త్రీలు పూజించబడుతారు అక్కడ దేవతలు కొలువై ఉంటారని తెలిపారు.సమాజంలో మార్పు తీసుకురావాలంటే మహిళా మూర్తుల పాత్ర అత్యంత కీలకమన్నారు, మహిళలు అన్ని రంగాల్లో ముందుకెళ్లాలని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుతున్నారు.గతంలోని కేసీఆర్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందన్నారు, గత సమైక్య పాలనలో తాగడానికి మంచినీళ్లు లేక మహిళలు ఖాళీ బిందెలతో రోడ్లమీద ధర్నాలు చేసే వారిని గుర్తు చేశారు . ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత కెసిఆర్ ప్రభుత్వ హయాంలో గోదావరి జలాలతో తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన సురక్షితమైన నల్ల నీరును అందించి మహిళలను రోడ్ల మీదకి రాకుండా చేసిన ఘనత కేసీఆర్ ది అన్నారు. మహిళలకు భరోసాగా మేనమామ కానుకగా మహిళలను ఆడబిడ్డలను గౌరవిస్తూ కల్యాణ లక్ష్మి పథకం తీసుకొచ్చి పెళ్లి చేసుకున్న ప్రతి ఆడ బిడ్డకు లక్ష రూపాయల ఆర్థిక సాయం చేసిన ఘనత కేసిఆర్ ది అన్నారు. అంతేకాకుండా గర్భిణీ స్త్రీలకు మంచి పౌష్టికాహారం అందించడం కోసం న్యూట్రిషన్ కిట్టిన అందించిన ఘనత కేసిఆర్ ది అన్నారు. కెసిఆర్ కిట్టు ద్వారా తల్లి పిల్లలకు కావలసిన సామాన్లను కెసిఆర్ కిట్టు రూపంలో అందించిన ఘనత కేసిఆర్ ది అన్నారు, అంతేకాకుండా బీడీ కార్మికులకు పెన్షన్ ఇచ్చిన ఘనత కేసిఆర్ ది అన్నారు, తెలంగాణ రాష్ట్రంలో ఒంటరి మహిళలకు దేశంలోనే మొట్టమొదటిసారిగా పెన్షన్లను అందజేసిన ఘనత కేసిఆర్ ది అన్నారు, అదే కాకుండా వితంతువులకు వృద్ధులకు, వికలాంగులకు నేరుగా పెన్షన్లను వారి ఖాతాలో జమ చేసిన ఘనత కేసిఆర్ ది అన్నారు. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్రంలో చదువుకునే పేద విద్యార్థుల కోసం గురుకుల పాఠశాలలో మైనార్టీ పాఠశాలలు రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యార్థినిలకు కావలసిన వసతులను కల్పించి నాణ్యమైన విద్యతో పాటు హాస్టల్లో నాణ్యమైన భోజనాన్ని అందించిన ఘనత కేసిఆర్ ది అన్నారు ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ గంశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ పద్మాబాయి నర్సింగ్ రావు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, కౌన్సిలర్లు గోలి మమతా సంతోష్, బొగ్గుల స్వప్న సురేష్, మన్నెరూప వెంకటేష్, కప్పు మమత పోచయ్య, కొలిచెల్మి భవానీ కరుణాకర్, కోట బాబు, ఫర్జానా బేగం, రజియా బేగం, నాయకులు గుంటూకు రాజు, రమేష్,అహ్మద్, పాల రమేష్ గౌడ్, హనుమంత్ రెడ్డి,యూత్ అధ్యక్షుడు స్వామి చారి, తదితరులు ఉన్నారు

# జక్కల వారి గూడెం లో సీసీ రోడ్డు పనుల ప్రారంభం



**మునుగోడు భారతీయ వెలుగు**
మునుగోడు మండలం గ్రామం జక్కల వారి గూడెంలోని హనుమాన్ టెంపుల్ కాలనీ లో రూ 5 లక్షల NRGS నిధులతో నూతన సీ సీ రోడ్డు పనులను ఆదివారం సర్పంచ్ జక్కల రేవతి మహేష్ ప్రారంభించారు ఉపసర్పంచ్ జక్కల పార్వతమ్మ ముత్యాలు చండూర్ మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ వార్డ్ నెంబర్ జక్కల కృష్ణ దాసరి రేణుక జక్కల శంకర్ రావుల నాగలక్ష్మి మాజీ ఎంపీపీ కర్నాటి స్వామి మాజీ సర్పంచ్ శ్రీను జక్కల మల్లేష్ జక్కల మల్లయ్య జక్కల యాదయ్య జక్కల సందీప్ కర్నాటి నరసింహ దాసరి దశరథ దాసరి పకీర్ కర్నాటి నాగరాజు జక్కల ఎట్టయ్య తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా నిర్వహించిన మహిళా దినోత్సవం వేడుకలు

» మహిళా పోలీసుల సేవలు అద్భుతం.. సిబ్బందికి సన్మానం



**తొగట మార్చి 08 భారతీయ వెలుగు**
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తొగట సిఐ లతీఫ్ కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తొగుట సర్కిల్లో పనిచేయుచున్న రాయపోల్ ఎస్సై మానస కుకునూరుపల్లి తోగుట, రాయపోల్ దౌల్తాబాద్ బేగంపేట్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి శాలువ లతో సత్కరించి,పూలమాలతో సన్మానం చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా తొగట సిఐ లతీఫ్ మాట్లాడుతూ మహిళా పోలీస్ సిబ్బంది మధ్య ఏకాభిప్రాయత, బృందంగా పని చేసే భావన పెరిగిందని తెలిపారు పోలీస్ విధులు ఇతర ఉద్యోగాల కంటే ఎంతో భిన్నమైనవని, ఎల్లవేళలా ప్రజల భద్రత కోసం రాత్రింబవళ్లు విధులు నిర్వర్తించాల్సి ఉండటంతో పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులు, ముఖ్యంగా తల్లులు మరియు భార్యలు అందించే సహకారం, సహనం మరియు ప్రోత్సాహం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా సిఐ లతీఫ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలతోనే రాబోయే తరాలకు ఉజ్వల భవిష్యత్తు

» స్త్రీలను గౌరవించే చోట శాంతి సౌభాగ్యాలు విలసిల్లుతాయి

» సర్పంచ్ బోయిని రమేష్



**చిగురుమామిడి, మార్చి 08,భారతీయ వెలుగు**
అంతర్జాతీయ మహిళా దినోత్సవన్ని పురస్కరించుకొని ముదిమాణిక్యం గ్రామంలో గ్రామ సర్పంచ్ బోయిని రమేష్ గ్రామంలో ఉన్న మహిళ వార్డు సభ్యులు,అంగన్వాడి టీచర్లు, ఆయాలు, వివో లు, ఆశా కార్యకర్తలు, గ్రామ సిబ్బంది మహిళలను ఘనంగా సన్మానించారు, ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మనిషి పుట్టుక మనుగడ మహిళతోనే సాధ్యం, సమాజానికి వెన్నెముక మహిళ,రాబోయే తరాలకు ఉజ్వల భవిష్యత్తును సృష్టించే అవకాశం మహిళతోనే సాధ్యమని,ఎక్కడ స్త్రీలు పూజించబడతారో అక్కడ మహిళా దేవతలు ఉంటారని, మహిళలను గౌరవించడానికి పలు రంగాల్లో ఆమె చేసిన సేవలను ప్రపంచానికి చాటి చెప్పడానికి మహిళా దినోత్సవం జరుపుకోవడం చాలా సంతోషం అన్నారు, మహిళలు విద్య, వైద్యం, రాజకీయం, వ్యాపార, రంగాలతో పాటు తమ కుటుంబ బాధ్యతలను నెరవేస్తున్నారని,ఒక ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించిన ఘనత మహిళలకే దక్కుతుందన్నారు,మహిళలు ఆర్థిక స్వాలంబన దిశగా అడుగులు వేయవలసిన అవసరం ఉందన్నారు, ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన తహసీల్దార్.. రూ.4 కోట్ల అక్రమాస్తుల గుర్తింపు

**గజ్వేల్ మార్చి 08 భారతీయ వెలుగు**



సిద్దిపేట జిల్లా గజ్వేల్ తహసీల్దార్ కాటన్ శ్రవణ్ కుమార్ అవినీతి నిరోధక శాఖ ఏసీబీ అధికారులకు చిక్కారు. విధుల్లో ఉన్న సమయంలో అక్రమ మార్గాల్లో ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆదాయానికి మించిన అక్రమ ఆస్తుల విషయంలో నమోదైన కేసులో భాగంగా శనివారం కరీంనగర్‌లోని ఆయన నివాసంతో పాటు తన సోదరి ఇంటిలో ఏక కాలంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో దాదాపు రూ.4 కోట్ల విలువైన అక్రమ ఆస్తులను ఏసీబీ గుర్తించింది. అంతే కాకుండా వారి ఆస్తులు మార్కెట్ విలువ కంటే ఇంకా ఎక్కువ ఉండే అవకాశం ఉందని ఏసీబీ అధికారులు పేర్కొన్నట్లు తెలిసింది. ఈ సోదాల్లో రూ.11.90 లక్షల నగదు, రూ.4.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.15.66 లక్షల విలువైన గృహోపకరణాలు, రూ. 30 లక్షలు విలువ చేసే లగ్జరీ వాహనాలు, రెండు రూ.1.6 లక్షలు విలువ చేసే ద్విచక్ర వాహనాలు, కరీంనగర్ లో 2 ఇళ్ళు, ఒక అపార్ట్మెంట్ లో 6 ప్లాట్లు, 4 ఖాళీ ప్లాట్లు పత్రాలను సైతం ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వీటి విలువ రూ. 2.47 కోట్లు ఉంటుందని తెలుస్తుంది. ఈ నేపథ్యంలో అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి తహసీల్దార్ ను అదుపులోకి తీసుకుని కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు. తహసీల్దార్ తన అధికారిక హోదా దుర్వినియోగం చేసి ఈ ఆస్తులను కూడబెట్టినట్లు ఏసీబీ ప్రాథమిక దర్యాప్తులో తేలింది

# ముచ్చటగా మూడోసారి..

## చరిత్ర సృష్టించిన భారత్.. టీ20 వరల్డ్ కప్ కైవసం



ఐసీసీ మెన్స్ టీ20 వరల్డ్ కప్ 2026 విజేతగా భారత్ నిలిచింది. ఫైనల్ లో న్యూజిలాండ్ పై అద్భుత విజయంతో వరల్డ్ కప్ ను కైవసం చేసుకుంది. 96 పరుగుల తేడాతో కివీస్ ను చిత్తు చేసింది భారత్. తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా భారీ స్కోర్ చేసింది. 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగులు చేసింది. 256 రన్స్ టార్గెట్ తో బరిలోకి దిగిన కివీస్ 19 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌట్ అయ్యింది.టీ20 ప్రపంచ కప్ 2026 విజేతగా నిలిచి భారత్ సరికొత్త చరిత్ర సృష్టించింది. కొత్త కొత్త రికార్డులు నెలకొల్పింది. టీ20 వరల్డ్ కప్ చరిత్రలో భారత్ విజేతగా నిలవడం ఇది ముచ్చటగా మూడోసారి. తొలిసారి 2007లో (ఫస్ట్ ఎడిషన్ ధోని కెపెన్సీలో), రెండోసారి 2024లో (రోహిత్ శర్మ కెప్టెన్సీలో), ఇప్పుడు సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో 2026లో భారత్ విశ్వ విజేతగా నిలిచింది. ఈ గెలుపుతో తొలిసారి 'ట్రిపుల్' సాధించిన జట్టుగా టీమిండియా రికార్డ్ నెలకొల్పింది. అంతేకాదు సొంతగడ్డపై నెగ్గిన తొలి టీమ్‌గా కొత్త చరిత్ర సృష్టించింది. అంతేకాదు బ్యాక్ టు బ్యాక్ వరల్డ్ కప్ (2024, 2026) సాధించిన జట్టుగా కూడా భారత్ హిస్టరీ క్రియేట్ చేసింది.









Publishers & Owner Gunnala lavanya PLOT NO 332/P, ROAD NO 13, KRUSHI NAGAR, MADINAGUDA, MIYAPUR, SERILINGAMPALLY, RANGAREDDY, TELANGANA-500049. RNI: TGTEL/26/A0320. Printers VASISTA PRINTERS, 18-97#306, 3rd loor, Rajini gandha Complex, kamala Nagar, Chaitanyapuri, Rangareddy, Telangana, 500060 Editor Gunnala Anilreddy Phone 9642844456, 9705043131